కేరళ పాఠశాలల్లో శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మిషన్లు
- ఎల్‌డిఎఫ్ మరో ఘనత

• లోపలి పేజీలో..•

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 284 | విజయవాడ, బుధవారం 17 మే 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Wednesday 17 May 2023 | Rs

ఐపిఎల్ 2023

3 బెర్త్‌లు.. రేసులో ఏడుజట్లు..
- ప్లే-ఆఫ్స్ ఛాన్స్ దక్కేదెవరికో..?

• లోపలి పేజీలో..•

బటన్ నొక్కి నిధులు జమ చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

దిగజారుడు రాజకీయాలు

వచ్చే ఎన్నికల్లో పొత్తులు, ఎత్తులు, కుయుక్తులనే నమ్ముకున్న చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్

- వారు యుద్ధం చేస్తున్నది నాతోకాదు... జనంతో
- 'వైఎస్ఆర్ మత్స్యకార భరోసా' సభలో ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- బాపట్ల

అధికార కాంక్షతో టిడిపి అధినేత చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొత్త అబద్దాలతో ప్రజలను మోసగించాలని చూస్తున్నారని, పొత్తులు, ఎత్తులు, కుయుక్తులతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో వైఎస్ఆర్ మత్స్యకార భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో సిఎం జగన్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారులకు సాయం అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికీ రూ.10 వేల చొప్పున 1,23,519 మంది మత్స్యకార కుటుంబాలకు రూ123.52 కోట్లు, ఒఎన్‌జిసి పైపులైన్ ఏర్పాటుతో జీవనోపాధి కోల్పోయిన 23,458 మంది మత్స్యకారులకు రూ.108 కోట్ల ఆర్థిక సాయాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఇదే వేదిక నుంచి దిండి గ్రామంలో రూ.185 కోట్లతో నిర్మించనున్న ఆక్వా పార్కుకు, చీరాల వాడరేవులో రూ.417 కోట్లతో నిర్మించనున్న ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన చేశారు. సభా వేదికగా సిఎం జగన్ రాజకీయాలపైనే ప్రధాన ప్రసంగం చేశారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకం కూడా గుర్తుకు రాదని, ఆయన పేరు తలిస్తే గుర్తుకొచ్చేది వెన్నుపోటేనని విమర్శించారు. పేదలకు మంచి చేయని ఆయనకు ఎవరైనా ఎందుకు మద్దతు ఇస్తారని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలో ఉంటే అమరావతి, అధికారంపోతే జూబ్లీహిల్స్‌లో ఉంటారని విమర్శించారు. ఎపిలో దోచుకోవడం, హైదరాబాద్లో ఉండడం వీరి పని అని దుయ్యబట్టారు. తాను తాడేపల్లిలో ఇల్లు కట్టుకొని ఉంటున్నానని గుర్తు చేశారు. ప్రధానులను, రాష్ట్రపతులను చేశానని చెప్పుకుంటున్న చంద్రబాబుకు ఒంటరిగా బరిలోకి దిగే దమ్ముందా? అని ప్రశ్నించారు. 175 స్థానాల్లో పోటీ చేసే సత్తా, సభలు పెట్టే ధైర్యం లేదన్నారు. 'చంద్రబాబుకు ఏది మంచి జరిగితే అదే చేస్తానంటాడు ఆయన దత్తపుత్రుడు. ఏ పార్టీని కలవాలో దత్తపుత్రుడికి చంద్రబాబే చెప్తాడు. చంద్రబాబు చెప్తే దత్తపుత్రుడు బిజెపి పక్కన చేరతాడు. బిజెపికి విడాకులు ఇవ్వమంటే ఇచ్చేస్తాడు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే చంద్రబాబు గెలుపని పండగ చేసుకుంటారు. కర్ణాటకలో ఓడిన బిజెపిని తమతో కలిసి రావాలని వీళ్లే కోరతారు. వీరు చేస్తుంది నాతో యుద్ధం కాదు... జనంతో యుద్ధం. వీరు చేస్తోంది రాజకీయ పోరాటం కాదు... అధికారం కోసం ఆరాటం. పేదలకు మంచి చేయాలన్న

మిగతా 2లో

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధానన్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆయనతో పాటు సీనియర్ న్యాయవాది కెవి విశ్వనాథన్‌ను కూడా సుప్రీంకోర్టు జడ్జీగా ప్రతిపాదిస్తూ కొలీజియం సిఫార్సు చేసింది. ఈ మేరకు భారత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం మంగళవారం సమావేశమై నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఉన్న జస్టిస్ దినేష్ మహేశ్వరి, జస్టిస్ ఎంఆర్ షా ఈ నెలలో పదవీ విరమణ చేయనున్నారు. దీంతో సర్వోన్నత న్యాయస్థానంలో రెండు న్యాయమూర్తుల పోస్టులు భర్తీ చేయాల్సివుంటుంది. ఈ స్థానాలకు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాను, న్యాయవాది కెవి విశ్వనాథన్‌ను కొలీజియం ప్రతిపాదించింది. వీరి నియామకాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేయాల్సివుంది. ఆ తర్వాత వీరు ఇరువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణస్వీకారం చేస్తారు.

రవాణా వాహనాలపై త్రైమాసిక పన్నును ఉపసంహరించుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ

• లోపలి పేజీలో..•

విశాఖ స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్‌లోకి వెళ్లనీయకుండా కార్మికులను అడ్డుకుంటున్న సిఆర్‌పిఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీసులు

కదంతొక్కిన ఉక్కు కార్మికులు

వేతన సవరణ కోసం అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి

ప్రజాశక్తి- ఉక్కునగరం

సెయిల్ తరహాలో వేతన సవరణ ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్‌ను ముట్టడించారు. భారీగా ఉక్కు కార్మికులు, ఉద్యోగులు తరలివచ్చి వేతన సవరణపై పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఆందోళన కొనసాగించారు. అడ్మిన్ బిల్డింగ్ రోడ్డును దిగ్బంధించి ఈ మార్గంలో రాకపోకలను స్తంభింపజేశారు. వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు ఒక్కసారిగా అడ్మిన్ బిల్డింగ్ లోపలకు చొచ్చుకుపోవడానికి ప్రయత్నించారు. వారిని అడ్డుకునేందుకు సిఆర్‌పిఎఫ్, స్థానిక పోలీసులు ప్రయత్నించడంతో ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కార్మికులు రోడ్డుపై బైటాయించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ ఉక్కు కర్మాగార పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదన్నారు. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉక్కు ఉద్యోగుల గౌరవ వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణకు సహకరించడాన్ని యాజమాన్యం, ఉన్నతాధికారులు మానుకోవాలని డిమాండ్ చేశారు. కర్మాగారంలో ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన ఉక్కు సిఎండి, ఉన్నతాధికారుల బంగ్లాలను ముట్టడిస్తామని కార్మికులు కొద్ది రోజుల క్రితమే ప్రకటించడంతో సిఎండి అతుల్ భట్ సహా ఇతర అధికారులు మంగళవారం బంగ్లాల్లో లేకుండా వేరే చోటుకు వెళ్లిపోయారు. దీంతో, కార్మికులు సుమారు ఆరు గంటలపాటు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఆందోళన కొనసాగించారు. ఎట్టకేలకు అక్కడికి స్టీల్ ప్లాంట్ జిఎం (హెచ్ఆర్) సంజీవరావు వచ్చారు. సిఎండి, ఇతర ఉన్నతాధికారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో, కార్మికులు ఆందోళన విరమించారు. ఈ పోరాటానికి ఉక్కు కార్మిక సంఘాల నేతలు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్ తదితరులు నేతృత్వం వహించారు. కార్మికుల పోరాటానికి టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు.

తేలని కర్ణాటకం !

- ఖర్గే, రాహుల్ విస్తృత మంతనాలు
- సిద్ధూ, డికెలతో కొలిక్కిరాని చర్చలు
- సిఎం ఆశావహులతో నేడు మలి విడత భేటీ

న్యూఢిల్లీలో ఖర్గేతో విడివిడిగా సమావేశమైన శివకుమార్, సిద్ధ రామయ్య

న్యూఢిల్లీ : కర్ణాటక ముఖ్యమంత్రి పీఠంపై సందిగ్ధత వీడలేదు. ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న మాజీ సిఎం సిద్ధరామయ్య, కర్ణాటక ప్రదేశ్ కమిటీ (పిసిసి) అధ్యక్షులు డికె శివకుమార్‌తో కాంగ్రెస్ అగ్రనాయకత్వం మంగళవారం విడివిడిగా జరిపిన చర్చలు కొలిక్కిరాలేదు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, యువనేత రాహుల్ గాంధీ, ఎఐసిసి ప్రధానకార్యదర్శి కెసి వేణుగోపాల్, నూతన ఎమ్మెల్యేల్లో కొందరు విడిగా సమావేశమై ముఖ్యమంత్రి అంశంపై మంతనాలు జరిపారు. లౌకికవాదంపై నిర్భయంగా నిలబడే నేతగానూ, ప్రజల్లో విశేషాదరణ కలిగిన నేతగానూ మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకే అధిష్టానం మొగ్గు చూపినట్లుగా కథనాలు వెలువడ్డాయి. అయితే కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో తనదైన ప్రత్యేక వ్యూహాలతో బిజెపిని మట్టికరిపించి కాంగ్రెస్‌ను విజయతీరానికి చేర్చిన నేతగా పిసిసి చీఫ్ డికె శివకుమార్‌కు పెరిగిన ప్రాబల్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయనను కూడా అధిష్టానం కాదనలేకపోతోంది. ఈ నేపథ్యంలో 'ముఖ్యమంత్రి ఎవరు?' అనే అంశాన్ని ఢిల్లీలో ప్రకటిస్తే బావుండదని, బెంగళూరులోనే ప్రకటిస్తే మంచిదన్న అభిప్రాయానికి అధిష్టానం వచ్చినట్లు ఎఐసిసి శ్రేణులు తెలిపాయి. చర్చలు, మంతనాల సారాంశాన్ని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి వివరించిన తర్వాత ఆమె నిర్ణయాన్ని కూడా తీసుకొని బుధవారం నాడు బెంగళూరులో ప్రకటన చేయనున్నారు. సిమ్లాలో ఉన్న సోనియా మంగళవారం రాత్రి ఢిల్లీకి చేరుకోగానే ఖర్గే ఆమెను కలవనున్నారు. ముఖ్యమంత్రి ఎవరనేది ప్రకటించడానికి ముందు ఈ ఇద్దరు నేతలతో ఖర్గే మరోసారి సమావేశమయ్యే అవకాశముందని విశ్వసనీయ వర్గాల బోగట్టా.

శివకుమార్ గ్రూపు వాదన

కాంగ్రెస్ అధిష్టానం వద్ద శివకుమార్, సిద్ధరామయ్య గ్రూపు ఎవరికి

మిగతా 5లో

దాట్ల బాల వెంకటేశ్

రష్యాలో భారత రాయబారిగా పోడూరు వాసి

ప్రజాశక్తి - పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం పోడూరు సంతతికి చెందిన దాట్ల బాల వెంకటేష్‌వర్మ (కల్నల్ దాట్ల సత్యనారాయణ రాజు మనవడు) భారత్ తరపున రష్యా రాయబారిగా నియమితులయ్యారు. రష్యా రాజధాని మాస్కోలో మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. 1988 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. మాజీ కల్నల్ డిఎస్‌రాజు ఆర్మీలో వైద్యులుగా విధులు నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారు. ఆయన పేరు మీద పోడూరులో జెడ్‌పి హైస్కూల్, పాలిటెక్నిక్ కళాశాల నెలకొల్పాడ్రు. ఈ సందర్భంగా వర్మను పలువురు ప్రముఖులు అభినందించారు.

మజ్జిగ లేదు.. నీళ్ళు లేవు

- వ్యకాస నాయకుల వద్ద సమస్యలను ఏకరువు పెట్టిన ఉపాధి కార్మికులు

ప్రజాశక్తి - యంత్రాంగం

రోజుకు రూ.272 వేతనం రావడం లేదని, ఉపాధి పనులు తప్ప వేరే పనులేవీ లేవని, ఈ పనులు కూడా ఎన్ని రోజులు ఉంటాయో తెలీదని, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, పనిముట్లు, సమ్మర్ అలవెన్స్, ప్లే స్లిప్పులు, తాగునీరు, మజ్జిగ ఇవ్వడం లేదని తమ సమస్యలను వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల వద్ద ఉపాధి కార్మికులు ఏకరువు పెట్టారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో మంగళవారం నాయకులు పర్యటించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో ఉపాధి కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎపి రైతుసంఘం పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. అత్తిలి మండలం దంతుపల్లి, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం గోళ్లమూడిలో ఉపాధి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంగళగిరి మండలంలో రాజధాని విలీన గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని వ్యకాస నాయకులు ఎండిఒకు వినతి పత్రం ఇచ్చారు. మేడికొండూరు మండలం, కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం బుద్ధవరం, ఉయ్యూరు మండలం ఓగిరాలలో ఉపాధి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గుంటూరు జిల్లా గోళ్లమూడిలో ఉపాధి కార్మికుల సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

ఆలస్యంగా రుతుపవనాలు

- 4న కేరళను తాకే అవకాశం

న్యూఢిల్లీ : దేశంలోకి ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక కొద్దిగా ఆలస్యం కానుంది. జూన్ 4వ తేదీ నాటికి కేరళకు నైరుతి రుతుపవనాలు చేరుకునే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) మంగళవారం అంచనా వేసింది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1 నాటికే కేరళలో ప్రవేశిస్తాయి. గత ఏడాదిలో మే 29 నాటికే కేరళలో ప్రవేశించగా, 2021లో జూన్ 3 నాటికి, 2020లో జూన్ 1 నాటికే కేరళకు చేరుకున్నాయి. అలాగే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐఎండి వేసిన అంచనా ప్రకారం ఈ ఏడాది జూన్-సెప్టెంబర్ సీజన్‌లో రుతుపవనాల ప్రభావం సాధారణంగానే ఉంటుంది. సాధారణ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. ఎల్‌నినో అభివృద్ధి, మధ్య పసిఫిక్‌లో అధిక ఉష్ణోగ్రతలు కారణంగా ఈ ఏడాది వర్షాలు తక్కువగానే నమోదవుతాయని తెలిపింది. కేరళకు రుతుపవనాల రాకను అంచనా వేయడానికి ఐఎండి ప్రత్యేక వాతావరణ నమూనాను ఉపయోగిస్తుంది. వాయువ్య భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు, రుతుపవనాలకు ముందు (మార్చి-మే) కురిసిన వర్షపాతం, ఈశాన్య హిందూ మహాసముద్రంలో గాలులు వంటి అంశాలను ఐఎండి పరిగణనలోకి తీసుకుంటుంది. దేశంలో వర్షపాతం ప్రధానంగా రుతుపవనాల వల్లే సంభవిస్తుంటుంది. దేశ సాగు విస్తీర్ణంలో 52 శాతం రుతుపవనాలపైనే ఆధారపడి ఉన్న సంగతి విదితమే.

వొడాఫోన్‌లో 11,000 మంది ఉద్యోగులపై వేటు
- మూడేళ్లలో తొలగించనున్న బ్రిటన్ కంపెనీ
- భారత్‌లో అమెజాన్ 500 మందికి ఉద్వాసన

• లోపలి పేజీలో..•

పరిహారం అరకొరే!

3,280 మంది వంశధార నిర్వాసితులకు దక్కని ఎక్స్‌గ్రేషియో

- రూ.68.12 కోట్లు పెండింగ్
- ఏడాది కావస్తున్నా జమ కాని డబ్బులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర తాత్సారం చేస్తోంది. పరిహారం చెల్లింపునకు ఉత్తర్వులు ఇచ్చి ఏడాది కావస్తున్నా, నేటికీ వేలాది మందికి డబ్బులు ఇవ్వలేదు. పరిహారం ప్రకటన నుంచి చెల్లింపుల వరకు ప్రభుత్వం తొలి నుంచీ ఇదే వైఖరి కనబరుస్తోంది. నిర్వాసితుల ఆందోళనలతో జిఒ ఇచ్చిన ప్రభుత్వం చెల్లింపుల దగ్గరకొచ్చేసరికి వెనకడుగు వేస్తోంది. శ్రీకాకుళం జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర, హిరమండలం ఎన్నికల ప్రచార సభలో వంశధార నిర్వాసితులకు భూసేకరణ చట్టం-2013 అమలు చేస్తామంటూ హామీ ఇచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చినా అమలు చేయకపోవడంతో నిర్వాసితులు పలురూపాల్లో ఆందోళనలు చేపట్టారు. నిర్వాసితుల ఆగ్రహాన్ని దృష్టిలో పెట్టుకుని గతేడాది జూన్ ఆరో తేదీన జిఒ నంబరు 1632ను ప్రభుత్వం విడుదల చేసింది. పరిహారం స్థానంలో ఎక్స్‌గ్రేషియోతో సరిపెట్టింది. వంశధార ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి ఎకరాకు రూ.లక్ష చెల్లించనున్నట్లు తెలిపింది. యూత్ ప్యాకేజీ కింద రూ.లక్ష ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఇందుకోసం రూ.216.71 కోట్లను విడుదల చేస్తున్నట్లు తెలిపింది.



పరిహారం కోసం జిల్లా పరిషత్తు కార్యాలయం వద్ద వంశధార నిర్వాసితులు (ఫైల్)

రూ.68.12 కోట్ల బకాయిలు

భూములకు ఎక్స్‌గ్రేషియో కింద 15,571 మంది రైతులకు 9,580 ఎకరాల కోసం రూ.95.80 కోట్లు ఇవ్వాల్సి ఉంది. 7,103 పిడిఎఫ్ కుటుంబాలు, 4,988 మందికి యూత్ ప్యాకేజీ కలిపి మొత్తం 12,091 మందికి రూ.120.91 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటివరకు 6,048 ఎకరాలకు సంబంధించి 12,291 మంది రైతులకు రూ.60.48 కోట్లు ఇచ్చారు. ఇంకా 3,280 మంది రైతులకు 3,532 ఎకరాలకు రూ.35.32 కోట్లు పెండింగ్‌లో ఉంది. పిడిఎఫ్, యూత్ ప్యాకేజీల కోసం ఇప్పటివరకు 8,811 మందికి రూ.88.11 కోట్లు చెల్లించారు. పిడిఎఫ్ కుటుంబాల్లో 3,280 మందికి రూ.32.80 కోట్లు ఇవ్వాల్సి ఉంది. నిర్వాసితులకు మొత్తం మీద 216.71 కోట్లకుగానూ

మిగతా 2లో

19న విచారణకు హాజరు కండి

- అవినాష్ రెడ్డి లేఖతో కొంతసమయం ఇచ్చిన సిబిఐ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో/పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో విచారణకు హాజరు కాలేనని సిబిఐ అధికారులకు ఎంపి అవినాష్ రెడ్డి లేఖ రాశారు. ఒక్కరోజు ముందు మాత్రమే తనకు సమాచారం ఇచ్చారని, ముందస్తు కార్యక్రమాలు ఉన్నందున విచారణకు హాజరు కాలేకపోతున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో విచారణను వేగవంతం చేసిన సిబిఐ... మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని అవినాష్ రెడ్డికి సోమవారం నోటీసులు ఇచ్చింది. ఆయన లేఖ రాసిన నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం సిబిఐ అధికారులు పులివెందులలోని వైఎస్ అవినాష్ ఇంటికి వచ్చారు. అవినాష్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయన తండ్రి వైఎస్.భాస్కర్‌రెడ్డి డ్రైవర్ నాగరాజుకు నోటీసు అందజేశారు. ఈ నెల 19న మధ్యాహ్నం మూడు గంటలకు హైదరాబాద్‌లోని సిబిఐ కార్యాలయానికి అవినాష్‌రెడ్డి విచారణకు హాజరు కావాలని ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. కాగా, వివేకా కుమార్తె సునీతా, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డిలను మంగళవారం మరోసారి సిబిఐ విచారించింది.

40 వరికుప్పలు దగ్ధం

ప్రజాశక్తి - పోలవరం

ఏలూరు జిల్లా పోలవరం మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామం పంట పొలాల్లోని వరి కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు వంద ఎకరాల్లో 40కి పైగా వరికుప్పలు దగ్ధమయ్యాయి. స్థానిక రైతుల వివరాల మేరకు.. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో పంట పొలాంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిప్పులు చెలరేగి వరి కుప్పలపై పడటంతో మంటలు చెలరేగాయి. మంగపతిబోదె మొదలు పాసాల దొడ్డి, రాంచెరువు పుంత, పల్లపు బాడవ వరకూ వంద ఎకరాల పంట పొలాల్లో 40కి పైగా వరి కుప్పలు దగ్ధమయ్యాయి. దీంతో రైతులు భారీ స్థాయిలో నష్టపోయారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఖరీఫ్‌లో నిల్వ చేసిన వరికుప్పలను రైతులు నూర్చలేకపోయారు. ప్రమాద సమయంలో వేడిగాలులు, వడగాలులు ఎక్కువగా ఉండడంతో మంటలను అదుపు చేయలేకపోయారు. సంఘటనా స్థలాన్ని మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు సందర్శించి, బాధిత రైతులతో మాట్లాడారు. పంట నష్టాన్ని పరిశీలించామని, ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

అధికారిక యజ్ఞం లౌకికవాద ఉల్లంఘనే : సంగమం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా శ్రీలక్ష్మి మహాయజ్ఞం నిర్వహించడం లౌకికవాద ఉల్లంఘనే అని 16 ప్రజా సంఘాలతో కూడిన 'సంగమం' విమర్శించింది. ఈ మేరకు జనసాహితీ ప్రధాన కార్యదర్శి అరుణ, జాషువా సాంస్కృతిక వేదిక నాయకులు నారాయణరావు, ప్రొగ్రెసివ్ ఫోరం ప్రధాన కార్యదర్శి బుడ్డిగ జమిందార్, ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి మురళీకృష్ణ, విప్లవ రచయితల సంఘం అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ, సోషల్ సైన్సెస్ ట్రస్ట్ కార్యదర్శి ఎన్ అంజయ్య మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మానవ కృషి, సైన్స్ మాత్రమే అభివృద్ధికి మూలమని సంగమం తెలిపింది. పూర్తిగా ఒక మత సంప్రదాయం ప్రకారం దీన్ని నిర్వహించడం భారత రాజ్యాంగ లౌకిక స్ఫూర్తికి తూట్లు పొడవడమేనని పేర్కొంది. రాజ్యాంగం నుండి మతాన్ని వేరుచేయడమే లౌకికవాద సారాంశమని తెలిపింది. మౌలికవాద సూత్రాలను రాజ్యం, ప్రభుత్వం అధికారవర్గం ఉల్లంఘించడానికి అవకాశం లేకుండా చేసేందుకు ఒక సమగ్ర మార్గదర్శక నియమావళిని రూపొందించుకుని అమలు చేయాల్సిన అవసరం, బాధ్యత అందరిపై ఉందని, ఆ దిశగా కృషి చేయాలని కోరింది.

ప్రత్యేక హోదా ఇచ్చేది కాంగ్రెస్ పార్టీనే

- ఎపిసిసి నాయకులు గౌతమ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ద్వారానే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధ్యమని ఎపిసిసి నాయకులు జంగా గౌతమ్ అన్నారు.

మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపికి వత్తాసు పలికే పార్టీలకు ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారని అన్నారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు కోర్టు సమన్లు ఇవ్వడం సరైంది కాదని తెలిపారు. బిజెపి దుర్మార్గపు ఆలోచనలతోనే వేధింపులకు దిగుతోందని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆదరించారని తెలిపారు. దేశంలో ప్రస్తుతం కాంగ్రెస్ గాలి వీస్తోందన్నారు. తెలుగుదేశం, జనసేన, వైసిపి అన్నీ బిజెపికి తొత్తులేనని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు కొరివి వినయ్‌కుమార్, నరహరిశెట్టి నరసింహారావు, ధనేకుల మురళి, మీసాల రాజేశ్వరరావు, కొలనుకొండ శివాజి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడి మృతి

- కాటా వేసే తాడు మెడకు చుట్టుకోవడంతో ఘటన

ప్రజాశక్తి - కాజులూరు (కాకినాడ)

అంగన్‌వాడీ కేంద్రంలో బరువు తూచే తాడు మెడకు బిగిసుకుపోవడంతో బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెం మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గొల్లపాలెం సాయిబాబా వీధిలోని అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్ వేసవి సెలవుల్లో ఉంది.

ఈ నేపథ్యంలో ఆయా గుబ్బల విజయలక్ష్మి కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఎప్పటిలానే అంగన్‌వాడీ కేంద్రం తెరచి పిల్లలను తీసుకురావడానికి గ్రామంలోకి వెళ్లారు. ఇదే సమయంలో స్థానికంగా ఉంటున్న సేరు మనోజ్ చంద్రశేఖర్(10) తన చెల్లిని అంగన్‌వాడీ కేంద్రంలో దింపేందుకు వచ్చాడు. ఎవరూ లేకపోవడంతో తలుపులు తీసుకుని తన చెల్లిని అంగన్‌వాడీ కేంద్రంలోకి తీసుకెళ్లాడు. ఇంతలో మరికొంత మంది పిల్లలను తీసుకుని ఆయా వచ్చారు. లోపలకు వెళ్లి చూసేసరికి బరువు తూచే తాడు చంద్రశేఖర్ మెడకు బిగిసిపోయి ఉండటాన్ని గమనించారు. సమాచారం అందుకున్న మనోజ్ తండ్రి వెంటనే అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి బాలుడిని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చంద్రశేఖర్ మరణించాడు. తాడును పట్టుకుని ఊయల ఊగుతుండగా మెడకు బిగిసుకుపోయి చనిపోయినట్టు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అక్కడికి చేరుకుని, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అన్ని విధాల ఆదుకుంటామని భరోసానిచ్చారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

రాజ్యాంగ స్ఫూర్తికి గొడ్డలిపెట్టు

- బిజెపి విధానాలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఉయ్యూరు (కృష్ణా జిల్లా)

మనువాద, ఫాసిస్టు విధానాలను అమలు చేస్తోన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పాలన దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి విధానాలు భారత రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి గొడ్డలిపెట్టుగా పరిణమించాయన్నారు. 'రాజ్యాంగ రక్షణ - ప్రజాస్వామ్య పరిరక్షణ' అనే అంశంపై కృష్ణా జిల్లా ఉయ్యూరులో మంగళవారం సామాజిక కార్యకర్త జి.వి.నాగేశ్వరరావు అధ్యక్షతన బహిరంగ సదస్సు జరిగింది. ఈ సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపి మతోన్మాద చర్యలతో ప్రజాస్వామ్య సామాజిక జీవనానికి పెనుప్రమాదం ముంచుకొస్తోందన్నారు. మతం ముసుగులో విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మనువాదాన్ని ముందుకు తెస్తూ సామాజిక జీవనంలోకి అనాగరికమైన చర్యలకు పురికొల్పుతోందన్నారు. చాతుర్వర్ణ వ్యవస్థను భారతీయ ధర్మంగా, ఆత్మగా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఐక్యంగా తిప్పికొట్టాలని కోరారు. సమాఖ్య వ్యవస్థకు కేంద్రం తూట్లు పొడుస్తోందని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ విద్వేషపూరిత, ఫాసిస్టు విధానాలతో ప్రజలు ప్రమాదంలోకి నెట్టబడుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో విభిన్న భాషలు, మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలతో కూడిన కోట్లాది మందిని ఏకజాతిగా జీవించేలా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మేళవించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. మతోన్మాద మనువాద సిద్ధాంతాలను తిప్పికొట్టడం ద్వారానే భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోగలమన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదాను బిజెపి విస్మరించిందన్నారు. రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు కేంద్ర నిరంకుశ, విద్వేష, మతోన్మాద, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అడ్డుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్రంతో రాజీపడుతున్న రాజకీయ పార్టీలు ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. పోలవరం నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నట్టేట ముంచుతున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్ష నేతలను వేధించడానికి దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. నియంత పరిపాలన దిశగా దేశాన్ని నడిపిస్తోందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో విసికె పార్టీ అధ్యక్షులు ఎన్‌జె.విద్యాసాగర్, రిపబ్లికన్ పార్టీ నాయకులు కట్టా వేణుగోపాలకృష్ణ, చిగురుపాటి భాస్కరరావు, ప్రజా సంఘాల నాయకులు కోసూరు శివ నాగేంద్రం, బి.రాజేష్, బి.కీర్తి, శీలం ప్రకాశరావు, కంభం ప్రభుదాసు, కొండబాబు, ఇస్మాయిల్, ఎ సుబ్బారావు పాల్గొన్నారు.

నింగి నుండి నిప్పులు కురుస్తున్నా... స్వేదం చిందిస్తున్న శ్రమజీవులు... ఫొటో టివి రమణ

నిప్పుల కొలిమి : ధవళేశ్వరంలో 46.8 డిగ్రీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలోని వాయువ్య ప్రాంతం నుంచి వీస్తున్న ఉష్ణగాలుల ప్రభావంతో రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది.

సూర్య ప్రతాపానికి తోడు వడగాడ్పులు రాష్ట్రంలోని ఉష్ణోగ్రతల తీవ్రతను గరిష్టానికి చేర్చాయి. కోస్తాంధ్ర, రాయలసీమలోని అన్ని ప్రాంతాల్లోనూ మంగళవారం పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రతలు సగటున 45 డిగ్రీలు నమోదైంది. అత్యధికంగా రాజమండ్రి సమీపంలోని ధవళేశ్వరం వద్ద 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలో 46.7, శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రాష్ట్ర వ్యాప్తంగా 13 మండలాల్లో 46 డిగ్రీలు, 39 మండలాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ తెలిపారు. మొత్తం 255 మండలాల్లో 42 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. 148 మండలాల్లో వేడిగాలులు వీచినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా వుండాలని సూచించారు. రాగల రెండు, మూడు రోజులపాటు కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొనే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

వడదెబ్బకు హోమ్‌గార్డు సహా నలుగురు మృతి

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో వీచిన వడగాల్పులకు నలుగురు మృతి చెందారు. వీరిలో విజయనగరం జిల్లాకు చెందిన ఒక హోమ్‌గార్డు ఉన్నారు. మృతుల కుటుంబసభ్యుల కథనం ప్రకారం... విజయనగరం జిల్లాకు చెందిన హోంగార్డు వెలగాడ ప్రకాశం (53) శ్రీహరిపురంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ఓ చెరువు వద్ద బందోబస్తుకు వెళ్లి మంగళవారం మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో ఇంటికి వచ్చారు. గ్లాసుతో నీరు తాగి సేదతీరుతున్న సమయంలో కుప్ప కూలిపోయి మృతి చెందారు. ఆయన 26 ఏళ్లుగా వంగర పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. భార్య రోజా, పిల్లలు హారిక, మాధురి, హిందు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం కొర్లకోటకు చెందిన పేడాడ సింహాచలం (66) ముందు చేపలు పట్టేందుకు, ఆ తర్వాత గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లి తిరిగి మిట్ట మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి వచ్చారు. ఆ తర్వాత కొద్ది సమయానికి నీరసంగా ఉందని, కళ్లు తిరుగుతున్నాయని, ఒంట్లో తిప్పుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. 108 వచ్చేలోపు వాంతు కావడంతో స్పృహ తప్పి పడిపోయాడు. 108 సిబ్బంది వచ్చి ప్రాథమిక అందించినా స్పందన లేకపోవడంతో అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆయనకు భార్య చిలకమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని ఐతానగర్ హయ్యర్ పేటకు చెందిన వద్దురాలు గెడ్డం రత్తమ్మ (75) రెండు రోజులుగా వీస్తున్న వడగాల్పుల తీవ్రతకు అస్వస్థతకు గురై మృతి చెందారు. ఆమె భర్త ఇది వరకే చనిపోయారు. సామాజిక పింఛనుపైనే ఆమె పడ్డారు. వడదెబ్బకు గురైన ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామానికి చెందిన పుట్టా శంకరరెడ్డి (62) సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో మృతి చెందారు. ఆయనకు భార్య, వికలాంగురాలైన కుమార్తె ఉన్నారు.

ఎన్‌ఎఫ్‌పిఐ గుర్తింపును కొనసాగించాలి

- సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోస్టల్ ఉద్యోగుల జాతీయ సమాఖ్య (ఎన్‌ఎఫ్‌పిఐ), ఆలిండియా పోస్టల్ ఉద్యోగుల యూనియన్ (పి3)ల గుర్తింపును కొనసాగించాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేసింది. ఈ రెండు యూనియన్‌ల గుర్తింపు కొనసాగింపు కోసం పోస్టల్ ఉద్యోగుల పోరాటాలకు సిఐటియు సంపూర్ణ మద్దతు వుంటుందని తెలిపింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ తీర్మానాలను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు మంగళవారం ఒక ప్రకటనలో వివరించారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంకుశ పద్ధతులతో తిరోగమన విధానాలను అవలంబిస్తోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడే వారిపై కేంద్ర ప్రభుత్వం సిబిఐ, ఇడితో నిర్బంధాలు ప్రయోగిస్తోందని అన్నారు. సంఘ్‌పరివార్ శక్తులతో ఫిర్యాదులు చేయించి వేధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. ఇందులో భాగంగానే పోస్టల్ రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యోగుల సంఘాన్ని రద్దు చేశారన్నారు. అలాగే రాజమండ్రిలోని ఎపి పేపర్‌మిల్లు యజమాన్య తప్పుడు విధానాలపై కార్మిక సంఘాలన్నీ 130 రోజులుగా ఐక్యంగా పోరాటం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం తగదని అన్నారు. పేపర్ మిల్లులో వెరిఫికేషన్ ఎన్నికలను రహస్య బ్యాలెట్ ద్వారానే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంకితభావంతో పనిచేయాలి

- వైద్యారోగ్యశాఖ సమీక్షలో మంత్రి రజిని

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్యారోగ్యరంగ పరంగా రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధులకు అనుగుణంగా ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు, సౌకర్యాలు మెరుగుపడాలని వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వాస్పత్రుల తీరులో గణనీయమైన మార్పులు వచ్చాయనే విషయాన్ని నిరూపించేలా ఉండాలని వైద్యాధికారులకు మంత్రి సూచించారు.

మంగళగిరిలోని ఎపిఐఐసి టవర్స్‌లో వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులతో మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలోకి అడుగుపెట్టగానే రోగికి పొందబోయే సౌకర్యాల గురించి నాలుగైదు ప్రాధానాంశాల పోస్టర్లను ఆస్పత్రిలో ప్రదర్శించేలా చూడాలని మంత్రి సూచించారు. పారిశుధ్యం విషయంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బలవర్ధకమైన ఆహారం పంపిణీ జరుగుతున్నదీ లేనిదీ అధికారులు తరచూ చూడాలని ఆదేశించారు. ప్రతి ఆస్పత్రిలో మాతా, శిశు సంరక్షణ వార్డుల వద్ద బాలింతలకు ప్రత్యేకింకి పింక్ కర్టెన్లు ఏర్పాటు చేసి, పాలిచ్చే తల్లులకు తగినంత మరుగు ఉండేలా చూడాలని తెలిపారు. విశాఖ కెజిహెచ్ నాలుగేళ్లలో ఎంతో అద్భుతంగా మారిందని అన్నారు. మహిళా వార్డుల వద్ద క్లోజ్డ్ డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆస్పత్రుల పనితీరుకు కేటాయించే మార్కుల విషయంలో పారదర్శకత ఉండాలని, పనితీరు బాగుంటేనే మార్కులు ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో సిబ్బంది నుండి ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ తీసుకోవాలని, అందుకనుగుణంగా జీతానికి లింక్ చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అలాగే నిరంతరం డైట్ తనిఖీ చేయాలని సూచించారు. గతంలో రూ.40 ఉన్న ఛార్జీలను ప్రస్తుతం రూ.80కు పెంచామని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో మహాప్రస్థానం వాహనాలను పెంచాలని మంత్రి సూచించారు. పెద్ద జిల్లా అయిన గుంటూరు, యాత్రికులు ఎక్కువగా ఉండే తిరుపతిలోనూ ఈ వాహనాలను పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సిటీ, ఎమ్మారై యంత్రాలు ఎలా పనిచేస్తున్నాయో పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో వైద్య విద్యాశాఖ డైరెక్టరు డాక్టర్ నరసింహం, డిప్యూటీ డైరెక్టరు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విభేదాలను పక్కనబెట్టండి

- సంపన్న దేశాలను కోరిన పసిఫిక్ ఐలాండ్ దేశాల నేతలు

బ్యాంకాక్ : సంపన్న దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి వాతావరణ మార్పుల ప్రభావాన్ని నియంత్రించేందుకు తగు చర్యలు తీసుకోవాలని పసిఫిక్ ఐలాండ్ దేశాల నేతలు కోరారు. వాతావరణ మార్పులపై ఐక్యరాజ్య సమితి సోమవారం బ్యాంకాక్‌లో నిర్వహించిన సమావేశంలో వారు ప్రసంగించారు. వాతావరణ మార్పులకు ప్రధాన బాధ్యత సంపన్న దేశాలదే అయినా ఆ ప్రభావాన్ని నియంత్రించే విషయంలో ఆ దేశాలు తగినంత శ్రద్ధ పెట్టడం లేదని విమర్శించారు. కుక్ ఐలాండ్స్ ప్రధాని మార్క్ బ్రౌన్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం కోసం ఇచ్చే రుణ సాయం తమ ప్రాంతంలోని దేశాలకు అందే అవకాశమే లేదన్నారు. అతి తక్కువ జనాభా కలిగిన దేశాలు విడుదల చేసే కర్బన ఉద్గారాలు అత్యంత తక్కువగానే వుంటాయని, కానీ వాతావరణ ప్రభావాలను అత్యంత ఎక్కువగా ఎదుర్కొని ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. పేద దేశాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి గ్రాంట్ల రూపంలో కానీ, వడ్డీ లేని రుణాల రూపంలో కానీ ఇవ్వాలని కోరారు. పౌలు అధ్యక్షుడు సరెంగెల్ విప్స్ జూనియర్ మాట్లాడుతూ, ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చిన సంపన్న దేశాలు ఆ మాట నిలబెట్టుకోవడంలో విఫలమయ్యాయని విమర్శించారు.

పరిహారం అరకొరే!

మొదటి పేజి తరువాయి

రూ.148.59 కోట్లు చెల్లించింది. ఇంకా రూ.68.12 కోట్లు బకాయిలు ఉన్నాయి.

నిర్వాసితులను మభ్యపెడుతున్న ప్రభుత్వం

నిర్వాసితులకు ఎక్స్‌గ్రేషియో చెల్లింపులో ప్రభుత్వం మభ్యపెడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు డబ్బులు రాలేదని అడుగుతున్న నిర్వాసితులకు రిజర్వు బ్యాంకుకు డబ్బులు వివరాలు పంపామని, త్వరలోనే మీ ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని రెవెన్యూ అధికారులు బదులిస్తున్నారు. వలస వెళ్లిన కుటుంబాల చిరునామాలు తెలియకే డబ్బులు వేయలేకపోయామంటూ వారికి బంధువులకు చెప్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్లే బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

నా బాధ ఎవరితో చెప్పుకోవాలి

మాది కొత్తూరు మండలం గూనభద్ర. పనుల్లేక చిలకూరిపేటకు వచ్చేశాం. ప్రాజెక్టులో మా ఇల్లు కోల్పోయాం. మా బాబుకు యూత్ ప్యాకేజీ డబ్బులూ రావాలి. తహశీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్‌కు ఎన్నిసార్లు వెళ్లానో తెలియదు. పనులు మానుకుని, రానుపోనూ ఖర్చుల కోసం అప్పులు చేసి శ్రీకాకుళం వెళ్తున్నాను. ప్రభుత్వం కనికరించడం లేదు.

- భైరి ఉగాదమ్మ చిలకూరిపేట (గుంటూరు జిల్లా)

అప్పు చేసి ఇల్లు కట్టాను

మాది కొత్తూరు మండలం ఇరపాడు. మెట్టూరు బిట్-3లో స్థలం ఇచ్చారు. ఇళ్ల నిర్మాణానికి రూ.6 లక్షలు అప్పు చేశాను. పిడిఎఫ్ కింద ప్రభుత్వం లక్ష రూపాయాలు ఇస్తే కొంత అప్పు తీరుతాదనుకున్నాను. పరిహారం కోసం అధికారులను అడిగితే ఇదిగో అదిగో డబ్బులు పడతాయని చెప్తున్నారు. సంవత్సరం కావస్తున్నా డబ్బులు రాలేదు.

- గొట్ట రమణమ్మ, మెట్టూరు బిట్-3 (ఇరపాడు)

భూసేకరణ చట్టం అమలు చేయాలి

వంశధార నిర్వాసితులకు భూసేకరణ చట్టం-2013 అమలు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి తుంగలో తొక్కారు. ఎక్స్‌గ్రేషియో పేరుతో ఇస్తామన్న డబ్బులకూ దిక్కు లేకుండాపోయింది. నిర్వాసితుల ఖాతాల్లో ప్రభుత్వం వెంటనే డబ్బులు జమ చేయాలి.

- గంగరాపు సింహాచలం, నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

రవాణా వాహనాలపై త్రైమాసిక పన్నును ఉపసంహరించుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం రవాణా వాహనాలపై పెంచిన త్రైమాసిక పన్నులను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సరుకు రవాణా వాహనాలపై పెంచే పన్నుల ప్రభావం వాహన యజమానులతోపాటు నిత్యావసర ధరలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా, సరుకు రవాణా వాహనాలపై త్రైమాసిక పన్నును పెంచడంతో రవాణా రంగం మరింత కుదేలవుతుందని పేర్కొన్నారు. కరోనాతో ఈ రంగం పూర్తి సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. కరోనా నేపథ్యంలో ఈ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది ఉపాధిని కోల్పోయి అప్పులపాలయ్యారని తెలిపారు. ఈ రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించాల్సిన ప్రభుత్వం ఆ వైపుగా చర్యలు తీసుకోకుండా భారీగా పన్నులు పెంచడం సరైందికాదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సెస్సులు, పన్నులు పెంచుతూ మరింత సంక్షోభంలోకి నెట్టేస్తోందని విమర్శించారు. గ్రీన్ ట్యాక్స్ కింద పక్క రాష్ట్రాల్లో రూ.200, రూ.500 వసూలు చేస్తుంటే మన రాష్ట్రంలో దాన్ని కూడా శ్లాబుల వారీగా రూ.వేలల్లో వసూలు చేస్తున్నారన్నారు. సెస్సుల వసూలు అదనపు భారంగా మారిందని పేర్కొన్నారు. 30 శాతం పెరిగిన త్రైమాసిక పన్నులతో వాహన యజమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, తక్షణమే పన్నులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

పెంచిన పన్నులను తగ్గించకపోతే రోడ్డెక్కుతాం : ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్

రాష్ట్ర ప్రభుత్వం రవాణా వాహనాలపై పెంచిన త్రైమాసిక పన్నులను తగ్గించకపోతే రాష్ట్రవ్యాప్తంగా లారీ యజమానులు ఆందోళనబాట పడతామని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు విజయవాడలోని బెంజ్ సర్కిల్ వద్ద వున్న ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు మీడియాతో మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వం త్రైమాసిక పన్నుల పెంపునకు సంబంధించి ఈ ఏడాది జనవరి 11న నోటిఫికేషన్ ఇచ్చాక రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఈ పన్నుల పెంపుపై అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. వాహన యజమానులతోపాటు పలు సంస్థలు అభ్యంతరాలు తెలిపినా రాష్ట్రప్రభుత్వం 30 శాతం పన్నులను పెంచడం సరైందికాదన్నారు. రవాణాశాఖ అధికారులు, మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడం ఆందోళనకరమని అన్నారు.

గ్రీన్ ట్యాక్స్‌ను రూ.200 నుంచి ఏకంగా రూ.20 వేలకు పెంచడం తగదన్నారు. త్రైమాసిక పన్నులను కూడా పొరుగు రాష్ట్రాల కంటే ఎక్కువగా పెంచేశారని అన్నారు. ఆరు టైర్ల లారీలకు రూ.3,940 నుంచి రూ.4,790కు, పది టైర్ల లారీలకు రూ.6,580 నుంచి రూ.8,390కు, 12 టైర్ల లారీలకు రూ.8,520 నుంచి రూ.10,910కు, 14 టైర్ల లారీలకు రూ.10,480 నుంచి రూ.12,430కు, 16 టైర్ల లారీలకు రూ.11,980 నుంచి రూ.15,590కు పెంచారన్నారు. పొరుగు రాష్ట్రాల కన్నా డీజిల్ ధరలు చాలా ఎక్కువగా వున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం రవాణా రంగం గురించి ఆలోచించకపోవడం సరికాదన్నారు. తక్షణమే త్రైమాసిక పన్నులను తగ్గించాలని డిమాండ్ చేశారు. పన్నులను తగ్గించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు.

మత్స్యకార భరోసాలో సంప్రదాయ మత్స్యకారులు ఎక్కడ?

- ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన మత్స్యకార భరోసాలో సంప్రదాయ మత్స్యకారులు ఎక్కడని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను అధికారంలోకి వస్తే చేపలు అమ్మేవారికి, ఐస్‌ప్యాకింగ్, రవాణా చేసే వారికీ వేట నిషేధ భృతి ఇస్తామని సిఎం జగన్ ప్రకటించారని, ఆచరణలో జరగడం లేదని తెలిపారు. ఆచరణకు అమలు కాని 217 జిఓ ఇచ్చి మత్స్యకారులను అయోమయ పరిస్థితిలోకి నెట్టారని అన్నారు. ఈ జిఓను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఫిష్ ఆంధ్ర, ఆక్వాహబ్‌లు, ఫొటో స్టిక్కరింగ్ ప్రచారం తప్ప ఏమీ లేదని, పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. ఆక్వా రైతులకు ఇస్తున్న సబ్సిడీ కరెంటును జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రద్దు చేశారని అన్నారు. రైతులు అనేక ఇబ్బందులు పడి రూ.లక్షల కొలదీ అప్పులు చేసి బిల్లు కట్టే పరిస్థితి తీసుకొచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న నాలుగు జెట్టీలను మత్స్యకారులకు అనుకూలంగా నిర్మించాలి గానీ బడా పారిశ్రామికవేత్తలు వ్యాపారాలు చేసుకోవడానికి కాదని తెలిపారు. దీనివల్ల సముద్రంలో వేట చేస్తున్న మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతారన్నారు. డీజిల్ సబ్సిడీ లీటరుకు రూ.20 ఇవ్వాలని కోరారు. మత్స్యకారులను వృత్తికి దూరం చేసే నూతన పాలసీని రూపొందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దేశ నడవడికలో యువతదే కీలకపాత్ర

- మంత్రి డాక్టర్ భగవత్ కిషన్‌రావు కరాడ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రోజ్ గార్ మేళాలో మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక శాఖ సహాయక మంత్రి డాక్టర్ భగవత్ కిషన్‌రావు కరాడ్

దేశ నడవడికలో యువతదే కీలకపాత్ర అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయక మంత్రి డాక్టర్ భగవత్ కిషన్‌రావు కరాడ్ అన్నారు. యువత భవిష్యత్తే ప్రధాన లక్ష్యంగా ప్రధానమంత్రి రోజ్ గార్ యోజనను అమలు చేస్తున్నామని తెలిపారు. విశాఖలోని పోర్టు కళావాణి ఆడిటోరియంలో మంగళవారం రోజ్ గార్ మేళా ఐదో విడత నియామక పత్రాల పంపిణీని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతదేశం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తోందని పేర్కొన్నారు. టెక్నాలజీ, ఆర్థిక, సాంకేతిక, వ్యవసాయ రంగాల్లో ముందంజలో ఉందన్నారు. ఇప్పటికే ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన పథకం కింద 39 కోట్ల మంది భారతీయులకు ముద్ర రుణాలు అందించామని తెలిపారు. పక్క దేశాల్లో ఆహార ధాన్యాలను అధిక ధరకు అమ్ముతుంటే భారత్‌లో గరీబ్ కల్యాణ్ యోజన పథకం ద్వారా ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తున్నామన్నారు. అనంతరం వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు సాధించిన 385 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తపాలా శాఖ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ వి రాములు, కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్, వాల్తేరు రైల్వే డిఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి, జిఎస్‌ఐ డిప్యూటీ డైరెక్టర్ గుప్తా, రైల్వే, పోర్ట్, బిఎస్‌ఎన్‌ఎల్, ఐఐఎం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలు

మొదటి పేజి తరువాయి

తపన, తాపత్రయం వారికి లేదు' అని జగన్ విమర్శించారు. రెండు చోట్ల పోటీ చేస్తే.. తమకు ఎమ్మెల్యేగా వద్దని రెండు చోట్లా దత్తపుత్రుడిని ప్రజలు ఓడించిన పరిస్థితి చూశామన్నారు. పదేళ్ల క్రితం రాజకీయ పార్టీ పెట్టిన దత్తపుత్రుడు 175 చోట్లా అభ్యర్థులను పెట్టలేని స్థితిలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. సిఎం పదవి వద్దని, దోపిడీలో వాటా చాలని అంటున్నాడని విమర్శించారు. గజదొంగల ముఠాగా దోచుకోవడానికి వీరంతా కలుస్తున్నారని ఆరోపించారు. వీళ్లంతా ఎందుకు కలుస్తున్నారో ప్రజలు ఆలోచించాలన్నారు. ఎన్ని వ్యవస్థలను తనపై ప్రయోగించినా 15 ఏళ్లుగా ఎక్కడా రాజీపడలేదని, ప్రజల తరుపున నిలబడ్డానని, మంచి చేస్తున్నానని పేర్కొన్నారు. 'మీకు మంచి జరిగితే మీ బిడ్డతో నిలవండి. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధాన మంత్రి, రాష్ట్రపతిని కలిస్తే నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. బిజెపి, కాంగ్రెస్‌తో అంటకాగిన వాళ్లు నన్ను దూషిస్తున్నారు' అని విమర్శించారు. పొత్తులు పెట్టుకుని వివాహం చేసుకునేది వీళ్లేనని, విడాకులు ఇచ్చేది కూడా వీరేనని దుయ్యబట్టారు. మళ్లీ మళ్లీ పెళ్లిళ్లు చేసుకునేది వీళ్లేనని, మ్యాచ్ ఫిక్సింగ్ కూడా వీళ్లదేనని మండిపడ్డారు. మత్స్యకార భరోసా కింద ఇప్పటి వరకు రూ.538 కోట్ల సాయం అందజేశామని సిఎం తెలిపారు.

గంజాయి ముఠా అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిల్లాలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు చేస్తున్న పదిమంది ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఠా సభ్యుల నుంచి 22.3 కిలోల గంజాయి, ఆటో, స్కూటీ, మోటార్ సైకిల్, ఏడు సెల్ ఫోన్లు, రూ.48,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి చిన్న, చిన్న పొట్లాలుగా కట్టి విక్రయిస్తున్నారని తెలిపారు. గంజాయిని దాచినా, కొన్నా, అమ్మినా, అక్రమ రవాణా చేసినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫఠాన్ అఫ్జల్‌ఖాన్, పాణ్యం అశోక్‌కుమార్, పూల రాజేష్, పూల సరస్వతి, సయ్యద్, వర్ధన్, మహబూబ్ బాష, జయకుమార్, రమేష్‌లను తాము అరెస్ట్ చేశామని చెప్పారు.

పిడుగు పడి కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - రేణిగుంట

పిడుగు పడి కౌలు రైతు మృతి చెందిన ఘటన తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని కృష్ణాపురంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాపురం పంచాయతీ దిగువ మల్లవరం గ్రామానికి చెందిన నాగముంతల హరినాథ్ (47) అదే గ్రామంలోని మునస్వామి అనే రైతు వద్ద పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటు న్నారు. మంగళవారం ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో వర్షం మొదలైంది. ఆ సమయంలో వ్యవసాయం పనులు చేస్తున్న హరినాథ్‌పై పిడుగు పడింది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందారు. హరినాథ్‌కు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతితో కుటుంబం రోడ్డున పడిందని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సిసిఐ ఛైర్‌పర్సన్‌గా రవ్నీత్ కౌర్

న్యూఢిల్లీ : కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) నూతన ఛైర్‌పర్సన్‌గా రవ్నీత్ కౌర్ నియమితులయ్యారు. ఆమె నియామకానికి అపాయింట్‌మెంట్ కమిటీ ఆఫ్ కేబినెట్ (ఎసిసి) ఆమోదం తెలిపింది. రవ్నీత్ ఈ హోదాలో ఐదేళ్ల పాటు కొనసాగనున్నారు. ఇప్పటి వరకు అశోక్ కుమార్ గుప్తా సిసిఐ ఛైర్మన్‌గా ఉన్నారు.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 152 OF 2021

M/s.Kapil Chits (Telangana) Private Limited,H.NO.1-7, R.V.Complex 1st Floor, Madhira,Khammam District, Represented by its Branch Foreman, P. Anvesh, S/o, Venkateswar Rao, Age: 32 Years Years, Occ. Foreman Of above.
....DISPUTANT

VERSUS

Mr.Derangula Venkateswara Rao, & 5 Others

To

Opponent No.1. Derangula Venkateswara Rao, S/o. Guravaiah, Age: 28 Years, Occ: Goods Transport, R/o.H.No. 12-302/5/1, Ladakh Bazar, Madhira Mandal, Khammam Dist:507203.

Opponent No.2. Derangula Guravaiah, S/o. Roshaiah, Age: 48 years, Occ: Sweeper In SBH, R/o.H.No.12-302/5/1, Ladakh Bazar, Madhira Mandal, Khammam Dist : 507203 .

Opponent No.5. Battula Srinivasa Rao, S/o. Guru Swamy, Age: 39 years, Occ: ALM OSD, Nandigama, SPDCL, Vijayawada, Emp Id : 00013546, R/o.H.No.3-218, KCL Srinivasa Nagar, Jaggaiahpeta Mandal, Krishna Dist:521457
...OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 1,65,658/- against you and others and where as the above Arbitration/ Dispute is posted to 30-05-2023 for your appearance.

Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits,
Khammam.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking

గాంధీనగర్ బ్రాంచ్ (0891)
గాంధీనగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
ఫోన్: 0866-2573946, 8331015680

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
(1). **షేక్ షుకూర్, మొబైల్ ప్లాజా ప్రొప్రయిటర్,** డి.నెం. 23-11-120, ఎస్‌ఆర్‌పి రోడ్డు, సత్యనారాయణపురం, విజయవాడ-520011.
(2). **షేక్ ఫర్జానా, భర్త: షేక్ షుకూర్,** డి.నెం. 31-17-16ఎ/1, సాయి రెసిడెన్సీ, 3వ అంతస్తు, బి బ్లాక్, కుటుంబరావు వీధి, మాచవరం, విజయవాడ-520004.
(3). **షేక్ ఫరూక్, తండ్రి: షేక్ మోహమ్మద్ సాహెబ్,** డి.నెం. 31-17-16ఎ/1, శ్రీ సాయి రెసిడెన్సీ టవర్స్, 3వ అంతస్తు, కుటుంబరావు వీధి, మాచవరం డౌన్, విజయవాడ-5200 04.

డియర్ సర్/మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, గాంధీనగర్ బ్రాంచ్ నుండి
షేక్ షుకూర్ మరియు షేక్ ఫర్జానా పొందిన లోన్ / ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ఈ తేది నాటికి వడ్డీతో కలిపి బకాయి మొత్తం	వడ్డీ రేటు
హౌసింగ్ లోన్ అకౌంట్ నెం. 33427730000193	రూ. 19,50,000/- తేది: 01-07-2014	రూ.21,01,292.69 /-	10.95%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది 01.05.2023న నిరర్ధక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.21,01,292.69 (అక్షరాల ఇరవై ఒక్క లక్షల ఒక వెయ్యి రెండు వందల తొంభై రెండు రూపాయలు మరియు అరవై తొమ్మిది పైసలు)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది. SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, పటమట సబ్-రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ టౌన్, కృష్ణలంక, పచ్చమేడ బజారు, బ్లాక్ నెం. 10, రెవిన్యూ వార్డు నెం. 10, ఎన్.టి.ఎస్.నెం. 320, మున్సిపల్ వార్డు నెం. 20, డి.నెం. 41-20/2-61, మొత్తం 383.83 చ॥గ॥ లేదా 320.920 చ॥మీ॥ విస్తీర్ణం స్థలంలో అవిభాజ్యపు మరియు అనిర్దేశపు ఉమ్మడి వాటా 29.58 చ॥గ॥ లేదా 24.732 చ॥మీ॥. హద్దులు: తూర్పు: 18' అ॥ వెడల్పు మున్సిపల్ రోడ్డు, దక్షిణం: సామోజు వైకుంఠ వాసుదేవరావు ఆస్తి, పడమర: లాక తిరుపతయ్య ఆస్తి, ఉత్తరం: తాడపర్తి హనుమంతరావు ఆస్తి

ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, పటమట సబ్-రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ టౌన్, కృష్ణలంక, పచ్చమేడ బజారు, బ్లాక్ నెం. 10, రెవిన్యూ వార్డు నెం. 10, ఎన్.టి.ఎస్.నెం. 320, మున్సిపల్ వార్డు నెం. 20, డి.నెం. 41-20/2-61, పైన తెలిపిన స్థలంలో నిర్మించిన "జి టవర్స్ అపార్ట్‌మెంట్స్"లో ప్లింత్ ఏరియా 804.63 చ॥అ॥, ఉమ్మడి ఏరియా 201.10 చ॥అ॥ కలిగిన **ఫ్లాట్ నెం. T.F.1.** హద్దులు: తూర్పు: శూన్యాకాశం, మెట్లు, దక్షిణం: శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: ఉమ్మడి వరండా. **టైటిల్ హోల్డర్: షేక్ షుకూర్ మరియు షేక్ ఫర్జానా**

తేది: 02.05.2023, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

పరిశ్రమల్లో ప్రమాదాలకు ప్రభుత్వానిదే బాధ్యత

- ఉత్తరాంధ్రలో ప్రాణాంతకంగా మారిన కంపెనీలు
- 'పారిశ్రామిక మరణాలకు బాధ్యులెవరు ?' రాష్ట్ర సదస్సులో వక్తలు

సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జగదీష్ పటేల్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'రాష్ట్రంలో పరిశ్రమలు, ఫార్మా రంగాల్లో పలు చోట్ల నానాటికీ ప్రమాదాలు పెచ్చుమీరుతున్నాయి. ఈ ఘటనల్లో కార్మికులు మృత్యువాత పడుతున్నా వారిపైనే నిందలు మోపుతూ యాజమాన్యాలు తప్పించుకుంటున్నాయి. యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి' అని పీపుల్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ (బరోడా) ప్రొఫెసర్ జగదీష్ పటేల్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. 'పారిశ్రామిక మరణాలకు బాధ్యులెవరు?' అన్న అంశంపై విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ అధ్యక్షతన మంగళవారం సిఐటియు, అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన జగదీష్ పటేల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా భారత్, ఆంధ్రప్రదేశ్ సహా వివిధ దేశాల్లో జరుగుతున్న పారిశ్రామిక ప్రమాదాలు, కార్మికుల మరణాల వివరాలను వెల్లడించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికులను యాజమాన్యాలు చంపేస్తున్నాయన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలకు సాంకేతిక కారణాలే కాదు.. రాజకీయ కారణాలూ ఉన్నాయన్నారు. కనీస హక్కులు, భద్రతా కిట్లను కార్మికులకు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయంటూ ప్రభుత్వాలను ఎండగట్టారు. భోపాల్ దుర్ఘటనతో కొన్ని బలమైన చట్టాలు వచ్చాయని, అటువంటి చట్టాలుంటేనే యాజమాన్యాలు భయపడతాయని అన్నారు.

సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ సరళీకరణ విధానాలతో పరిశ్రమల్లో తనిఖీలకు కార్మికశాఖ అధికారులను వెళ్లనీయకుండా ప్రభుత్వాలు అడ్డుపడుతున్నాయన్నారు. పరిశ్రమల్లో బర్న్ యూనిట్లు ఎక్కడా లేకపోవడం దారుణమన్నారు. ఎల్‌జి పాలిమర్స్ కార్పొరేట్ కంపెనీ నిర్లక్ష్యం వల్లే 15 మంది కార్మికులు, ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. యాజమాన్యం కనీసం సైరన్ కూడా మోగించలేదని, మృతుల కుటుంబాలకు పరిహారం ఇచ్చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతులు దులుపుకున్నారని విమర్శించారు. సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫార్మా కంపెనీల్లో ప్రమాదం జరిగి కార్మికులు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు యాజమాన్యం కనీస సమాచారమైనా ఇవ్వడం లేదన్నారు. రియాక్టర్లను ఫ్యాక్టరీస్ అధికారులు కనీసం ఆరు నెలలకోసారి తనిఖీలు చేసి నాణ్యతను చూడాలని.. అలా జరగనందునే ఉత్తరాంధ్రలో కొద్ది నెలల్లోనే 120 ప్రమాదాలు జరిగి 190 మంది కార్మికులు మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పలువురు బాధిత కుటుంబ సభ్యులు తమ ఆవేదనను ఈ సదస్సులో వెల్లడించారు. రక్షణ రంగ నాయకులు నాగేశ్వరరావు, సిఐటియు శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు తమ ప్రాంతాల్లో ప్రమాదాలను వివరించారు. సదస్సులో సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా నాయకులు ఆర్ రాము, గనిశెట్టి సత్యనారాయణ, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు ఎస్ జ్యోతీశ్వరరావు, కుమారమంగళం పాల్గొన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న పలు సంఘాల నాయకులు, క్రీడాకారులు

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి

- పలు సంఘాల ఆధ్వర్యాన 3కె వాక్

ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం)

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి, క్రీడాకారుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన 3కె వాక్ నిర్వహించాయి. సంస్థానం హైస్కూల్ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం, ఎన్‌టిఆర్ విగ్రహం, తాండ్రపాపారాయ విగ్రహం మీదుగా గాంధీ విగ్రహం వరకు వాక్ కొనసాగింది. ప్రముఖ అథ్లెటిక్ కోచ్ రావు శ్రీనివాసరావు ఈ వాక్‌ను ప్రారంభించారు. భారతదేశానికి బంగారు పతకాలను సాధించి, దేశ కీర్తిని చాటిన మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే పదవి నుంచి తప్పించాలని, మహిళా అకాడమీల అధ్యక్ష పదవుల్లో మహిళలనే నియమించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఎఐటియుసి నాయకులు మునకాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళన నిర్వహిస్తోన్న రెజ్లర్లకు పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోందని తెలిపారు. తక్షణమే బ్రిజ్ భూషణ్ పై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మణి, డేవిడ్‌లు మాట్లాడుతూ.. రెజ్లర్లకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో తైక్వాండో ప్రముఖ కోచ్ బంకురు ప్రసాద్, సెటిల్ బాడ్మింటన్ కోచ్ బాబా, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, సిఐటియు నాయకులు సురేష్ కుమార్, వేదిక నాయకులు మధుసూధనరావు, కేశవరావు, రమేష్, రామకృష్ణ, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇఏపిసెట్‌కు 94.45శాతం హాజరు

- కేంద్రాలను తనిఖీ చేసిన జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించిన ఇఏపిసెట్-23 పరీక్షలకు రెండోరోజైన మంగళవారం 94.45 శాతం మంది హాజరయ్యారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు కలిపి ఇంజనీరింగ్‌కు 53,223 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 50,270 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో 48,862 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా 46,651 మంది హాజరయ్యారు. 95.48 శాతం హాజరు నమోదైంది. తెలంగాణలో 4,361 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా 3,619 మంది విద్యార్థులు హాజరయ్యారు. 82.99 శాతం హాజరు నమోదైంది. అనంతపురం ఎస్‌ఆర్‌ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఇఏపిసెట్ ఛైర్మన్ రంగజనార్ధన, సెట్ కన్వీనర్ శోభాబిందు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనంతపురం జెఎన్‌టియు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్ష రెండవ రోజు సజావుగా జరిగిందని తెలిపారు.

టైమ్ స్కేలు ఉద్యోగులకు అండ

- యువగళం యాత్రలో లోకేష్ హామీ

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

టైమ్ స్కేలు ఉద్యోగుల పోరాటానికి అండగా నిలుస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర శ్రీశైలం నియోజకవర్గం నుంచి నంద్యాల నియోజకవర్గంలోకి మంగళవారం ప్రవేశించింది. బండి ఆత్మకూరు విడిది కేంద్రం నుండి ప్రారంభమైన పాదయాత్ర పార్నపల్లె, కొత్తపల్లి మీదుగా మూలమట్టం విడిది కేంద్రం వరకు సాగింది. బండిఆత్మకూరు శివారు క్యాంపు సైట్‌లో కర్నూలు జిల్లా ఎన్‌ఎంఆర్, టైమ్ స్కేల్ ఉద్యోగులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పర్మినెంట్ చేస్తామని ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని, ఆ హామీ నేటికీ నెరవేరలేదన్నారు. 1993 నవంబర్ నాటికి విధుల్లో ఉండి పదేళ్ల సర్వీసు ఉన్న టైమ్ స్కేలు సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరారు. మీ పోరాటానికి అండగా నిలుస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. పార్నపల్లి గ్రామం మీదుగా పాదయాత్ర కొనసాగుతుండగా దారిపక్కన పంక్చర్‌షాపు నడుపుతున్న షేక్ హుసేన్ బేగ్ అనే వృద్ధురాలిని లోకేష్ పరామర్శించారు.ఏడాది క్రితం కిడ్నీ సమస్యతో భర్త చనిపోవడంతో, గతంలో తాను నేర్చుకున్న పంక్చర్లు ఇప్పుడు ఉపాధిగా మారిందని ఆమె వివరించింది. హజ్ యాత్రకి వెళ్లాలనేది తనజీవితకాల కోరిక అని, హజ్ వెళ్లాలంటే లక్షలు ఖర్చవుతాయని తెలిసి, దాచుకున్న పదివేల డబ్బుతో పేద మహిళలకు చీరలు కొని పంచేశానని చెప్పారు. తన సొంత ఖర్చుతో హజ్ యాత్రకి పంపుతానని ఆమెకు లోకేష్ భరోసా ఇచ్చారు. కొత్తపల్లి గ్రామప్రజలు లోకేష్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఫరూఖ్, భూమా అఖిల ప్రియ, టిడిపి నేత భూమా విఖ్యాత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ పంక్చర్ షాప్ నడుపుతున్న వృద్ధురాలు హుసేన్ బేగ్‌ను పలకరిస్తున్న నారా లోకేష్

ఏవి సుబ్బారెడ్డిపై దాడి

లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎపి విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ ఏవి సుబ్బారెడ్డిపై భూమా అఖిలప్రియ వర్గం దాడులకు దిగింది. లోకేష్ పాదయాత్ర మంగళవారం రాత్రి నంద్యాల జిల్లా కొత్తపల్లెకు చేరుకుంది. ఈ సందర్భంగా తమ బలం నిరూపించుకునే విషయంలో ఇరు గ్రూపులు ఘర్షణకు దిగాయి. ఏవి సుబ్బారెడ్డికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. గత కొద్ది కాలంగా ఇరుగ్రూపుల మధ్య విభేదాలు నడుస్తున్నాయి.

నార్పల మండలంలో దెబ్బతిన్న వేరుశనగ పంటను పరిశీలిస్తున్న రామకృష్ణ

పంటదెబ్బతిన్న రైతులను ఆదుకోండి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-శింగనమల, నార్పల (అనంతపురం)

వడగండ్లు, అకాల వర్షాలతో అనంతపురం జిల్లాలో పంట దెబ్బతిన్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా పరిధిలోని శింగనమల, నార్పల మండలాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాలతో రైతులు పెద్ద ఎత్తున పంటను నష్టపోయారన్నారు. చేతికొచ్చిన వేరుశనగ, వరి, మిరప, టమోటా, అరటి తదితర పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. అందరినీ ఆదుకుంటామని బటన్ నొక్కే ముఖ్యమంత్రి... పంట నష్టపోయిన రైతుల కోసం ఎందుకు బటన్ నొక్కలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 22న సిపిఐ ఆధ్వర్యంలో విజయవాడలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి, ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ నాయకులు పి.నారాయణస్వామి, డి.చిన్నప్పయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నగ్నంగా క్షుద్ర పూజలు

- మహిళపై అత్యాచారయత్నం • తాంత్రికుడి అరెస్టు

ప్రజాశక్తి - రేణిగుంట (తిరుపతి)

కుటుంబ సమస్యలు పరిష్కరిస్తామని, పూజల సమయంలో ఇంటిలో ఎవ్వరూ ఉండరాదని షరతులు విధించి మహిళపై అత్యాచారయత్నానికి ప్రయత్నించిన క్షుద్రపూజ తాంత్రికుడిని రేణిగుంట పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సిఐ మీడియాకు వివరించారు. ఆయన వివరాల మేరకు.. రేణిగుంట మండలంలోని కరకంబాడి పంచాయతీ తారక రామనగర్‌లో హేమలత(35), భర్త అంకయ్య నివాసం ఉంటున్నారు. కొద్దిరోజులుగా హేమలత అనారోగ్యానికి గురయ్యారు. ఎవరైనా చేతబడి చేసి ఉంటారన్న అనుమానంతో శ్రీకాళహస్తికు చెందిన క్షుద్రపూజ తాంత్రికుడు సుబ్బయ్యను ఆశ్రయించారు. ఇంట్లో అష్టదిగ్బంధనం చేయాలని, రూ.40 వేలు ఖర్చు అవుతుందని తాంత్రికుడు చెప్పాడు. అంత డబ్బు తమ వద్దలేదని చెప్పడంతో.. చివరకు రూ.20 వేలుకు ఒప్పందం చేసుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.7,500 ఫోన్ పే చేశారు. హేమలత ఇంటికి సుబ్బయ్య చేరుకుని.. ఇంటికి నాలుగు మూలల్లో గుంతలు తవ్వి నట్టింట ముగ్గవేశాడు. ఇంట్లో హేమలత మాత్రమే ఉండాలని ముందుగానే హెచ్చరించాడు. పూజలో నగ్నంగా కూర్చోమని చెప్పి ఆమె నోటిలో నిమ్మకాయ పెట్టి అరవకుండా చేసి, అత్యాచారం చేయబోయాడు. తాంత్రికుడి చేష్టలకు ఆమె నిర్ఘాంతపోయి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో తాంత్రికుడి అసలు బండారం బయటపడింది. స్థానికులు సుబ్బయ్యకు దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపే సుబ్బయ్య పరారయ్యాడు. పరారీలో ఉన్న సుబ్బయ్యను రేణిగుంట రమణ విలాస్ సర్కిల్ వద్ద అరెస్టు చేశారు.

వొడాఫోన్‌లో 11,000 మంది ఉద్యోగులపై వేటు

న్యూఢిల్లీ : ఆర్థిక మాంద్యం భయాలకు తోడు భవిష్యత్తు అనిశ్చిత్తిగా ఉండొచ్చనే అంచనాల్లో కార్పొరేట్ కంపెనీలు ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి. ఇప్పటికిప్పుడు వచ్చిన ముప్పు ఏమి లేనప్పటికీ.. భారీగా పొదుపు చర్యలను చేపడుతున్నాయి. ఇందులో భాగంగా తొలుత ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా రెండు దిగ్గజ కార్పొరేట్ కంపెనీలు వొడాఫోన్, అమెజాన్ వేల సంఖ్యలో ఉద్యోగుల కుదింపునకు దిగాయని మంగళవారం పలు రిపోర్టులు వచ్చాయి. బ్రిటన్‌కు చెందిన వొడాఫోన్ ఏకంగా 11,000 మందిని ఇంటికి పంపించాలని యోచించగా.. అమెజాన్ తన భారత కార్యకలాపాల్లోని 500 మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ట్విట్టర్, మైక్రోసాఫ్ట్, గూగుల్, కాగ్నిజెంట్, ఐబిఎం తదితర దిగ్గజ కంపెనీలు తమ వేలాది మంది ఉద్యోగులకు పింక్ స్లిప్‌లు జారీ చేయడం, తొలగింపులకు పాల్పడిన విషయం తెలిసిందే.

పంట రుణం రెన్యువల్‌కు వెళ్లి గుండెపోటుతో రైతు మృతి

ప్రజాశక్తి-పుట్లూరు (అనంతపురం)

పంట రుణాలను రెన్యువల్ చేసేందుకు వెళ్లిన ఓ రైతు బ్యాంకు ఆవరణంలోనే గుండెపోటుతో మరణించారు. అనంతపురం జిల్లా పుట్లూరు మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. మృతుని కుటుంబసభ్యుల కథనం ప్రకారం... పుట్లూరు మండలం శనగలగూడూరు గ్రామానికి చెందిన రైతు వెంకటరామిరెడ్డి (70) ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో రూ. లక్ష రూపాయలు పంట రుణం తీసుకున్నారు. రుణాన్ని రెన్యువల్ చేసేందుకు బ్యాంకుకు వెళ్లారు. తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో క్యూలైన్‌లో నిల్చొని రెన్యువల్‌కు సంబంధించిన సంతకాలను పూర్తి చేశారు. బ్యాంకు నుంచి బయటకు రాగానే ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయారు. తోటి రైతులు గుర్తించి ఆయనను ఆస్పత్రికి తరలించే లోపే మరణించారు. ఎండవేడిమి, గుండెపోటుతో రైతు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

కేంద్రానికి డివిడెండ్‌పై రేపు ఆర్‌బిఐ నిర్ణయం..!

ముంబయి : మే 16న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బోర్డ్ భేటీ కానుంది. ఈ సమావేశంలో కేంద్రానికి ఎంత మొత్తం డివిడెండ్‌ను చెల్లించాలనే దానిపై నిర్ణయం తీసుకోనుందని సమాచారం. ముంబయిలో భేటీ జరగనుందని ఈ వ్యవహారంతో సంబంధం కలిగిన వారు పేర్కొన్నట్లు బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. 2023 మార్చి 31తో ముగిసిన ఏడాదికి గాను కేంద్రానికి రూ.1 లక్ష కోట్ల నుంచి రూ.2 లక్షల కోట్ల మేర డివిడెండ్‌ను ప్రకటించే అవకాశం ఉందని స్టాండర్డ్ చార్టర్డ్ అంచనా వేసింది. ఇంతక్రితం ఏడాది రూ.30,310 కోట్ల డివిడెండ్‌ను అందించింది.

ఈతకెళ్లి ముగ్గురు యువకులు మృతి

ప్రజాశక్తి - నాగలాపురం

తిరుపతి జిల్లా నాగలాపురం మండలం బీరకుప్పం గ్రామ సమీపాన ఉన్న కోన అటవీ ప్రాంతంలోని భూపతీశ్వర జలపాతంలో మునిగి చెన్నైకి చెందిన ముగ్గురు యువకులు మతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ హనుమంతప్ప వివరాల మేరకు... చెన్నైకి చెందిన మాధవన్ (26), నవీన్ (22), కార్తీక్ ప్రసాద్ (29), మహేష్, మెరీనా స్నేహితులు. వీరు ఐదుగురు మంగళవారం ఉదయం నాగలాపురానికి వాహనంలో వాచ్చారు. బీరకుప్పం సమీపంలోని భూపతీశ్వర కోన అటవీ ప్రాంతం లోపలికి ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లారు. భూపతీశ్వర జలపాతం వద్ద మహేష్, మెరీనాలు ఒడ్డున ఉండగా నీటిలోకి నవీన్ మాధవన్, కార్తీక్ ప్రసాద్ దుకారు. ఎంతసేపటికి పైకి రాకపోవడంతో మహేష్, మెరీనా హైదరాబాద్ కంట్రోల్ రూమ్‌కు లొకేషన్ చాట్ చేశారు. దీంతో నాగలాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ఫైర్ ఇంజన్ సిబ్బంది, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. కొంతసేపటికే ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. నవీన్, మాధవన్‌లు ఎల్‌ఎల్‌బి చేశారు. కార్తీక్ ప్రసాద్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మహేష్, మెరీనాలు ఓ ప్రయివేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. స్నేహితులంతా సంతోషంగా గడుపుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాలను సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి టిటిడి జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు

ప్రజాశక్తి-క్యాంపస్

తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల, శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టిటిడి విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్ రెడ్డి తెలిపారు. మే 17 నుంచి జూన్ ఐదో తేదీ వరకు 'అడ్మిషన్ తిరుమల.ఆర్గ్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు దరఖాస్తు నింపే సమయంలో సాంకేతిక సందేహాలు, కోర్సులలోని వివిధ గ్రూపులు, వసతి గృహాలు, నిబంధనలు తదితర సందేహాలను హెల్ప్‌లైన్‌తో నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పొన్నూరు బ్రాంచి
యస్‌పిపి రోడ్డు, డోర్ నెం.17-14-21, పొన్నూరు-522124. ☎ 08643 245567

సవరణ

మెస్సర్స్ జైత్ర ప్లాస్టిక్ స్క్రాప్ ఇండస్ట్రీ, యజమాని: దాసరి శివనాగ మల్లేశ్వరరావు కు సంబంధించి **డి.16-05-2023** తేదీన ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ప్రజాశక్తి దినపత్రికలలో **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** ప్రచురించిన స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటనలో అమ్మకపు తేది 31-05-2023కు బదులుగా 25-05-2023 గా తప్పుగా ప్రచురితమైనది. కావున సాధారణ ప్రజానీకానికి **వేలం యొక్క సరైన తేది 31-05-2023**గా చదువుకోవలసినదిగా **అభ్యర్థించడమైనది.** ఇతర సమయపాలనలు అలాగే ఉంటాయి.

సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఇ-టెండరు ఆహ్వానపు ప్రకటన (http://ireps.gov.in ద్వారా) PUB/0512

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు దిగువ పనుల కొరకు టెండరింగ్ యొక్క సింగిల్ ప్యాకెట్ విధానంలో ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు.

1. **నిట్ నం.:** సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/02/2023-2024. **పని పేరు:** టెండరు నం. సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/02/2023-2024, తేది: 16.05.2023: (1)బిపిఎ-ఎంఎంజడ్ స్టేషన్ల మధ్య 3వ బిజి లైన్ యొక్క ప్రతిపాదిత నిర్మాణము- మంచిర్యాల జిల్లాలో రైల్వే కి.మీ. 247/25-27 వద్ద ప్రస్తుత నారొ ఆర్‌ఓబి నం.165-ఎ స్థానంలో కొత్త ఆర్‌ఓబి యొక్క ప్రతిపాదిత నిర్మాణము. (2) ఎస్‌సి డివిజన్ పై ఓపిఎల్-హెచ్‌ఎస్‌పి స్టేషన్ల మధ్య (ఐఆర్‌పిఎస్‌ఎం నం.11.05.29.22.4.54.003) మధ్య ఎల్‌సి గేట్ నం.8 యొక్క ఇంటర్లాకింగ్‌తో సంబంధించిన సిగ్నలింగ్ ఏర్పాట్లు. (3) ఎస్‌సి డివిజన్ పై ఓపిఎల్-జెఎంకెటి స్టేషన్ల మధ్య ఎల్‌సి గేట్ నం.15 యొక్క ఇంటర్లాకింగ్‌తో సంబంధించిన సిగ్నలింగ్ ఏర్పాట్లు(ఐఆర్‌పిఎస్‌ఎం నం.11.05.29.22.4.54.004) (4) ఎస్‌సి డివిజన్ పై విఐఎం-ఎస్‌కెజడ్‌ఆర్ స్టేషన్ల మధ్య ఎల్‌సి గేట్ నం.79 యొక్క ఇంటర్లాకింగ్‌తో సంబంధించి సిగ్నలింగ్ ఏర్పాట్లు (ఐఆర్‌పిఎస్‌ఎం నం.11.05.29.22.4.54.005). **అంచనా విలువ:** రూ. 40,58,839.66పై.లు **పూర్తిచేయు కాలవ్యవధి:** 18 నెలలు. **ముగింపు తేది:** 07.06.2023న 15:00గం.లు.

1) బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కొరకు, దయచేసి వెబ్‌సైట్ https://ireps.gov.in ను లాగిన్ చేయండి.
2) టెండరుదారులు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు.
3) ఆసక్తిగల టెండరుదారులందరూ టెండరు ఫారం ధర & ధరావత్తును ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించవలసిందిగా కోరబడుచున్నది.
4) రైల్వే ఏ కారణం చూపకుండానే టెండరును రద్దుచేయ అధికారాలు కలిగియుంటారు.
5) ఆసక్తిగల టెండరుదారులందరు జిఎస్‌టిన్ గుర్తింపు నం.లు పొంది మరియు వారి ఆఫర్లతోపాటు దాఖలుచేయవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.
6) టెండరుదారులు టెండరు దాఖలుచేయు కాలవ్యవధి (ప్రారంభ తేదీ వరకు ఏవేని నవరణ (ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడుతాయి)ను వీక్షించవచ్చును.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/ టిఆర్‌డి/ సికింద్రాబాద్

ఇ-టెండరు ఆహ్వానపు ప్రకటన (http://ireps.gov.in ద్వారా) PUB/0513

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు దిగువ పనుల కొరకు టెండరింగ్ యొక్క సింగిల్ ప్యాకెట్ విధానంలో ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు.

1. **నిట్ నం.:** సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/04/2023-2024. **పని పేరు:** టెండరు నం. సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/04/2023-2024 తేది: 16.05.2023: (1) పెద్దపల్లి-ప్యాసింజర్ లిఫ్టు ఏర్పాటు దృష్ట్యా ఓహెచ్‌ఇ ఆధునీకరణకు ఏర్పాట్లు. (2) రామగుండం-ప్యాసింజర్ లిఫ్టు ఏర్పాటు దృష్ట్యా ఓహెచ్‌ఇ ఆధునీకరణకు ఏర్పాట్లు. (3) మంచిర్యాల్-ప్యాసింజర్ లిఫ్టు ఏర్పాటు దృష్ట్యా ఓహెచ్‌ఇ ఆధునీకరణకు ఏర్పాట్లు. (4) రామగుండం- ప్రతిపాదిత ఎస్కలేటర్ దృష్ట్యా ఓహెచ్‌ఇ ఆధునీకరణకు ఏర్పాట్లు (5)ఆర్‌డిఎం- ప్రతిపాదిత ఆర్‌ఓబి దృష్ట్యా ఓహెచ్‌ఇ ఆధునీకరణలకు ఏర్పాట్లు (6) ఎంసిఐ- ఓహెచ్‌ఇ ఆధునీకరణలుకు ఏర్పాట్లు (7) పిడిపిఎల్-ఓహెచ్‌ఇ ఆధునీకరణలకు ఏర్పాట్లు. **అంచనా విలువ:** రూ.43,13,795.15 పై.లు, **పూర్తిచేయు కాలవ్యవధి:** 180 రోజులు. **ముగింపు తేది:** 07.06.2023న 15:00గం.లుకు

1) బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కొరకు, దయచేసి వెబ్‌సైట్ https://ireps.gov.in ను లాగిన్ చేయండి.
2) టెండరుదారులు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు.
3) ఆసక్తిగల టెండరుదారులందరూ టెండరు ఫారం ధర & ధరావత్తును ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించవలసిందిగా కోరబడుచున్నది.
4) రైల్వే ఏ కారణం చూపకుండానే టెండరును రద్దుచేయ అధికారాలు కలిగియుంటారు.
5) ఆసక్తిగల టెండరుదారులందరు జిఎస్‌టిన్ గుర్తింపు నం.లు పొంది మరియు వారి ఆఫర్లతోపాటు దాఖలుచేయవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.
6) టెండరుదారులు టెండరు దాఖలుచేయు కాలవ్యవధి (ప్రారంభ తేదీ వరకు ఏవేని నవరణ (ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడుతాయి)ను వీక్షించవచ్చును.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/ టిఆర్‌డి/ సికింద్రాబాద్

బహిరంగ ఇ-టెండరు ప్రకటన నం. డిఆర్‌ఎం/ పనులు/బిజడ్ఎ/12/2023 తేది:12.05.2023 PUB/0515

భారత రాష్ట్రపతి తరపున క్రింది సంతకందారు దిగువ పనుల కొరకు ప్రతి దానికి ఎదురుగా పేర్కొన్న తేదీన 15-00గం.ల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

1. **టెండరు నం.:** ఇ-01-టిఎం-లైన్స్-బిజడ్ఎ-2023. **పని పేరు:** క్రింప్డ్ ఎండ్ ఫిటింగ్స్ & టి-28/పి క్యూఆర్ఎన్/ ఎస్క్యూఆర్ఎస్/రిపేర్స్‌తో వివిధ ప్రెషర్స్ హైడ్రాలిక్ హోసెస్ సరఫరా/ బిసిఎం, ఎఫ్‌ఆర్‌ఎం, హెచ్‌ఓబిసిఎం, బిఆర్‌ఎం మిషన్స్ కొరకు వివిధ వియర్ రెసిస్టెన్స్ ప్లేట్స్ ట్రాక్ మిషన్స్ మరమ్మత్తులు- మాన్యుఫాక్చరింగ్/ సరఫరా మరియు ఫిక్సింగ్. **పూర్తిచేయు కాలవ్యవధి:** 24 (ఇరువై నాలుగు) నెలలు. **టెండరు విలువ:** రూ.5,87,82,385/-, **ధరావత్తు:** రూ.4,43,900/- **ముగింపు తేది:** 31.05.2023.

1) ఆసక్తిగల టెండరుదారులు ఏదేని టెండరులో ఏవేని మార్పులు/సవరణలు గమనించుటకు టెండరు ముగింపు తేదీకి ముందు వెబ్‌సైట్ "https://ireps.gov.in."ను దర్శించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.

డిప్యూటీ చీఫ్ ఇంజినీర్/టిఎం/లైన్స్, విజయవాడ.

బహిరంగ ఇ-టెండరు ప్రకటన నం. బి/ ఇ.29-టిఆర్‌డి-టిఎన్‌డిఆర్-04-23-24 తేది: 12.05.2023 PUB/0514

దిగువ పనుల కొరకు క్రింది సంతకందారుచేత ఐఆర్ఇపిఎస్‌లో టెండర్లు కోరబడుచున్నవి.

1. **టెండరు నం.:** బి/ఇ.29-టిఆర్‌డి-టిఎన్‌డిఆర్-04-23-24. **పని వివరణ:** 1. విజయవాడ డివిజన్- జిడిఆర్-బిజడ్ఎ సెక్షన్: ఒపెన్ కట్ మెథడ్ ద్వారా **కెవిజడ్-ఎస్‌విపిఎం** స్టేషన్ల మధ్య కొత్త **కి.మీ.215/24-28 వద్ద ఎల్‌సి 150 స్థానంలో, రోడ్ అండర్ బ్రిడ్జి** యొక్క ప్రతిపాదిత నిర్మాణము. 2. విజయవాడ డివిజన్- జిడిఆర్-బిజడ్ఎ సెక్షన్: ఒపెన్ కట్ మెథడ్ ద్వారా **కెవిజడ్-ఎస్‌విపిఎం** స్టేషన్ల మధ్య **కి.మీ. 218/4-6 వద్ద ఎల్.సి. 152 స్థానంలో,** కొత్త **రోడ్ అండర్ బ్రిడ్జి** యొక్క ప్రతిపాదిత నిర్మాణము. 3. విజయవాడ డివిజన్- జిడిఆర్-బిజడ్ఎ సెక్షన్: ఒపెన్ కట్ మెథడ్ ద్వారా **కెవిజడ్-ఎస్‌విపిఎం** స్టేషన్ల మధ్య **కి.మీ. 219/18-20 వద్ద ఎల్.సి. 153 స్థానంలో,** కొత్త **రోడ్ అండర్ బ్రిడ్జి** యొక్క ప్రతిపాదిత నిర్మాణము. 4. విజయవాడ డివిజన్ - జిడిఆర్-బిజడ్ఎ సెక్షన్: ఒపెన్ కట్ మెథడ్ ద్వారా **కెవిజడ్-ఎస్‌విపిఎం** స్టేషన్ల మధ్య **కి.మీ. 219/32 వద్ద ఎల్.సి. 154 స్థానంలో,** కొత్త **రోడ్ అండర్ బ్రిడ్జి** యొక్క ప్రతిపాదిత నిర్మాణము. 5. విజయవాడ డివిజన్ - జిడిఆర్-బిజడ్ఎ సెక్షన్: ఎడిఇఎన్/ఓజిఎల్ సబ్-డివిజన్ పరిధిలో ఎస్ఎస్ఇ/వర్క్స్/ఓజిఎల్ సెక్షన్ లో నీటి ఆగ్మెంటేషన్ ఫ్లోకు ఒపెన్ కట్ మెథడ్ ద్వారా **ఆర్.సి.సి బాక్సులతో బ్రిడ్జి నం.550 డౌన్, 551 డౌన్ & 552 డౌన్** మార్చుట. 6. విజయవాడ డివిజన్- జిడిఆర్-బిజడ్ఎ సెక్షన్: ఎడిఇఎన్/ఓజిఎల్ సబ్-డివిజన్ పరిధిలో ఎస్ఎస్ఇ/వర్క్స్/ఓజిఎల్ సెక్షన్ లో నీటి ఆగ్మెంటేషన్ ఫ్లోకు ఒపెన్ కట్ మెథడ్ ద్వారా **ఆర్.సి.సి బాక్సులతో బ్రిడ్జి నం.553 డౌన్, 554 డౌన్ & 555 డౌన్** మార్చుట. 7. విజయవాడ డివిజన్- జిడిఆర్-బిజడ్ఎ సెక్షన్: ఎడిఇఎన్/ఓజిఎల్ సబ్-డివిజన్ పరిధిలో ఎస్ఎస్ఇ/వర్క్స్/ఓజిఎల్ సెక్షన్ లో నీటి ఆగ్మెంటేషన్ ఫ్లోకు ఒపెన్ కట్ మెథడ్ ద్వారా **ఆర్.సి.సి బాక్సులతో బ్రిడ్జి నం.563 డౌన్, 565 డౌన్ & 566 డౌన్** మార్చుట. 8. విజయవాడ డివిజన్ లో **ఎకెవిడి-యుఎన్‌డిఐ** స్టేషన్ల మధ్య **కి.మీ.104/4-5 వద్ద** మ్యాన్డ్ ఎల్‌సి గేట్ నం.**113** మిడ్ సెక్షన్ ఇంటర్లాకింగ్ కొరకు **ఎటి సప్లై** ఏర్పాటుచేయుట. **పూర్తిచేయు కాలవ్యవధి:** 12 నెలలు. **సుమారు విలువ:** రూ.66,92,219/- **బిడ్ సెక్యూరిటీ ధరావత్తు:** 1,33,900/-

క్ర.సం. 1- **టెండరు ఫారం ధర:** రూ. నిల్, **ముగింపు తేది:** 08.06.2023న 15.00గం.లకు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/ టిఆర్‌డి/ విజయవాడ.

ఇ-టెండరు ప్రకటన నం.05-2023 తేది: 15.05.2023 PUB/0516

భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ చీఫ్ ఇంజినీర్/గాటీ శక్తి యూనిట్/ గుంతకల్ వారు వ్యవహరిస్తు దిగువ పని కొరకు ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు. ముగింపు తేది & సమయం: 07.06.2023న 11:00గం.లుకు

1. **టెండరు నం.:** జిఎస్‌యు-జిటిఎల్-లిఫ్టులు-018. **పని వివరణ:** ఎస్‌డబ్ల్యు-1: రైల్వే స్టేషన్ల వద్ద 04 నం.ల లిఫ్టులు ఏర్పాటుచేయుట (02 నం.ల చొప్పున ధర్మవరం మరియు యాద్గిర్ స్టేషన్ వద్ద). ఎన్‌డబ్ల్యు-2: రైల్వే స్టేషన్ల వద్ద (సిటిఓ-2నం.లు) వద్ద 2నం.ల లిఫ్టులు ఏర్పాటుచేయుట. **ప్రకటన విలువ:** (రూ) 67,54,798.16పై.లు. **ధరావత్తు:** రూ. 1,35,100.00.

బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కొరకు https://ireps.gov.in లాగిన్ చేయండి. ఏవేని సవరణ ఆన్ లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడుతాయి.

డిప్యూటీ చీఫ్ ఇంజినీర్/గాటీ శక్తి యూనిట్/ గుంతకల్

A0719

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ **https:www.ireps.gov.in** లేదా **www.scr.indianrailways.gov.in**ని సందర్శించండి.

సంపాదకీయం

సంక్షేమంలో కేరళమార్గం!

పేదలకు పని కల్పించి గౌరవంగా జీవించడానికి ఉపకరించే మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం పీకనులిమేందుకు మోడీ సర్కారు చేయని ప్రయత్నం లేదు. ఈ దశలో ఆ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరింపజేయడం ద్వారా కేరళలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం 'ఉపాధి హామీ కార్మికుల సంక్షేమ నిధి బోర్డు'ను కూడా ఏర్పాటు చేసి ఉపాధి హామీ పట్ల తన తిరుగులేని నిబద్ధతతను చాటుకుంది.

వామపక్షాల ఒత్తిడితో ఊపిరిపోసుకున్న జాతీయ ఉపాధి హామీ చట్టం గ్రామీణ పేదలకు ఒక వరంగా నిలిచింది. పనులు బాగా కల్పించిన చోట వలసలు తగ్గాయి. చెరువు పూడికతీతల వల్ల భూగర్భ జలాలు పెరిగాయి. ఈ చట్టం ప్రారంభంలో 90 శాతం కార్మికుల ద్వారా, 10 శాతం మెటీరియల్ ద్వారా చేయాలని నిర్ణయించింది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక పథకం ప్రకారం దీనిపై దాడి చేస్తోంది. నిధుల కేటాయింపులు, పనిదినాల్లో కోత పెట్టి ఈ చట్టాన్నే నిర్వీర్యం చేయాలని చూస్తోంది. కార్మికుల పనులకు కేటాయించే నిధులను భారీగా తగ్గించి, మెటీరియల్ వర్క్‌ను 40 శాతానికి పెంచడంతో పనిదినాలు భారీగా తగ్గిపోయాయి. 2021-22లో రూ.98,467 కోట్లు వ్యయం చేస్తే, 2022-23లో రూ.73 వేల కోట్లకు కుదించింది. 2023-24 బడ్జెట్‌లో కేవలం రూ.60 వేల కోట్లే కేటాయించారు. గతేడాది సవరించిన అంచనా కేటాయింపుల్లో 33 శాతం కోత పెట్టారు. పథకంలో మోసాలను అరికట్టే పేరుతో హైటెక్ చర్యలను కార్మికులపై బలవంతంగా రుద్దుతోంది.

ఉపాధి కల్పన నుంచి చెల్లింపుల వరకూ కొత్త పద్ధతులు అమలు చేస్తోంది. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసి) నిర్వహిస్తున్న ఉపాధి హామీ పోర్టల్ పరిధిలోకి అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాలను తీసుకొచ్చింది. రాష్ట్రాలు నేరుగా ఈ పోర్టల్‌లోనే అప్‌లోడ్ చేయాలి. కార్మికుల హాజరుకు సంబంధించి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ పేరుతో (ఎన్ఎంఎంఎస్) హాజరు నమోదుకు ఈ ఏడాది జనవరి నుంచి యాప్ ప్రవేశపెట్టింది. పని ప్రదేశంలో కార్మికుల ఫొటోలను రెండుసార్లు తీసి జియో ట్యాగింగ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వీటిని సంబంధిత ఉద్యోగులు ధ్రువీకరించాల్సి ఉంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ సరిగా లేకపోవడంతో ఈ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవడం కోసం కార్మికులు గంటల తరబడి ప్రయాసపడాల్సి వస్తోంది. ఈ పద్ధతి గత ఐదునెలలుగా రాష్ట్రంలో అమలవుతోంది. ఆధార్ ఆధారంగా చెల్లించే పద్ధతి (ఎబిపిఎస్) ప్రవేశపెట్టింది. దీంతో... ఆధార్, బ్యాంకు ఖాతాల అనుసంధానం కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరోవైపు పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించడం లేదు. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకూ చెల్లించే సమ్మర్ అలవెన్స్‌ను రద్దు చేసింది. చేసిన పనికి నెలల తరబడి వేతనాలివ్వడం లేదు. ఇళ్ల నుంచి బయటకు రాలేని మండుటెండలు కాస్తున్న ఈ కాలంలో కూడా రెండుపూటలా పనిచేయించడం వల్ల రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. వంద రోజులు పని కల్పించాల్సి ఉండగా, మన రాష్ట్రంలో సగటున 50 పనిదినాలకు మించి కల్పించడం లేదు. గతంలో పనిచేసే చోట ఎండ తీవ్రత నుంచి రక్షించడానికి టెంట్లు, మంచినీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించేవారు. అవేవీ అమలుకు నోచడం లేదు.

ఉపాధి హామీ చట్టం కోసం ఒత్తిడి చేసిన వామపక్షాలు తాము అధికారంలో ఉన్న సమయంలో పట్టణ ప్రాంతాలకు సైతం విస్తరిస్తూ, కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లో అమలు చేశాయి. వీటికి కేంద్రం నుంచి రూపాయి కూడా ఇవ్వలేదు. పలు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలుసైతం అమలు చేసినా... బిజెపి పాలిత రాష్ట్రాలకు పట్టలేదెందుకో! కేరళ మోడల్‌గా దేశానికి విద్య, వైద్యం, ఉపాధి... ఇలా అనేక అంశాల్లో దిశానిర్దేశం చేస్తోన్న పినరయి విజయన్ ప్రభుత్వం తాజాగా ఉపాధి హామీ కార్మికుల సంక్షేమ నిధి బోర్డును అమలులోకి తీసుకొచ్చింది. వారి కుటుంబాలకు పెన్షన్, వివాహ సమయంలో, చదువుకు ఆర్థిక సహాయం... ఇలా సంక్షేమాన్ని అమలు చేస్తోంది. గ్రామీణ ఉపాధి హామీ, అయ్యంకాళి ఉపాధి హామీ పథకాల్లో భాగమైన 1.5 లక్షల కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధిపొందనున్నాయి. ఇప్పటికైనా కేంద్రం నిరుపేదలకు కూడుపెట్టే ఉపాధి హామీని చిత్తశుద్ధితో అమలుచేయాలి. సంక్షేమాన్ని విస్మరించి, మతోన్మాదాన్ని, మత విభజనను నమ్ముకోవడంతో కన్నడ నాట జనం ఇచ్చిన తాజా తీర్పు పాలకులకు కనువిప్పు కావాలి.

మహనీయుల మాట



నిరంతరం నేర్చుకొనే ఉపాధ్యాయుడే మంచి విద్యావంతులను తయారు చేయగలడు.

- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి.

Rabindranath Tagore

మల్లయోధలకూ తప్పని హింసల పరంపర

విమర్శ

> **'తోటకూర నాడే... చెప్పకపోయావా' అని తెలుగులో సామెత. కుటుంబం గానీ, తోటి వారు గానీ, సమాజం గానీ మొదలే స్పందించి ఉంటే... పరువు పోతుందనే భయాన్ని పక్కనపెట్టి తల ఎత్తి, నోరు తెరిచి ప్రశ్నించే తత్వాన్ని మన ఆడపిల్లలకు ఇచ్చి ఉన్నట్లయితే ...పరిస్థితి కొంత మెరుగ్గా ఉంటుందేమో. కోర్టులు ఎన్ని తీర్పులు ఇచ్చినా ఎన్ని మొట్టికాయలు వేసినా మారాల్సింది మన సంఘం తీరు. మన రాజకీయ నాయకుల తీరు. రాజకీయాలను, నాయకులను మనం చూసే తీరు. భ్రష్టు పట్టిన నాయకులకు ఎప్పుడైతే రొమ్ము విరుచుకొని, మీసాలు మెలేసి తిరగకుండా చెప్పులతో ఎప్పుడు సత్కారాలు దొరుకుతాయో అప్పుడే ఈ సమాజం బాగుపడేది.**

ఎస్. పుణ్యవతి

'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో' అన్న సినీ కవి వాక్కులు అధికార మదాంధులకు అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ సరిపోతాయి. ఢిల్లీ నడిరోడ్డు మీద, పార్లమెంటుకు కూతవేటు దూరంలో రోజుల తరబడి మల్ల 'యోధ' లైన యువతులు చేస్తున్న పోరాటం యావత్ దేశాన్ని కదిలిస్తోంది. మొత్తం సమాజం స్పందిస్తోంది. అంతర్జాతీయ సమాజం ఏం జరుగుతుందోనని పరిశీలిస్తోంది. కానీ కనీస స్పందన లేనిది అధికార మదాంధులకు మాత్రమే. 56 అంగుళాల ఛాతీని విరుచుకోవడం తెలిసిన నేతలకు దేశం పరువు నిలబెట్టిన యువతుల పరువు కాపాడాలన్న ఇంగిత జ్ఞానం, న్యాయం చేయాలన్న 'సోయ' మాత్రం లేకపోయింది. ఇది మన ఖర్మ అని సరిపెట్టుకోవాలా? లేక కౌరవ సభలో మాన మర్యాదలు కోల్పోయిన ద్రౌపది రోదన కురువంశ వినాశనానికి దారితీసిన విధంగా వీళ్ళ పాపం పండిందన్న నిర్ధారణకు రావాలా?

ఇప్పటికి నాలుగు నెలల నుండి ఆందోళన సాగుతోంది. అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కాక గాని కాస్త ఫైలు కదలలేదు. ఎందుకు అధినాయకుల్లో చలనం లేదు? రాతి గుండెలు అనుకోవాలా. అదే సాధారణ వ్యక్తులైతే చిన్న చిన్న నేరాలకే మక్కెలిరగ్గొట్టి, కేసులు పెట్టి, జైళ్లలో కుక్కి, ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిప్పుతారు కదా. అధికార, అర్థ బలంతో బలిసిన వాళ్లకు ఒక న్యాయం, సాధారణ పౌరులకు ఒక న్యాయమా! ఇదా ప్రజాస్వామ్యం?

ఆడపిల్లలు తమపై జరిగే ఏ అన్యాయమైనా...అది లైంగిక హింస గాని, గృహహింస గాని...పరువు పోతుందనో, పిల్లలు ఉన్నారనో, కెరీర్ నాశనం అవుతుందనో రకరకాల కారణాలతో నోరు విప్పరు. విప్పేలా చెయ్యదు ఈ సమాజం. పైగా 'నోరు మూసుకో' అని గదమాయిస్తుంది. లేకపోతే నోరు మూసుకొనేలా చేస్తుంది. గదిలో పడేసి కొడితే పిల్లి కూడా తిరగబడుతుంది. కాని, న్యాయం దొరుకుతుందో లేదో నన్న అపనమ్మకం. భయం. ఆ భయంతోనే పడి ఉంటారు. భరించలేకపోతే నుయ్యో గొయ్యో చూసుకోవడం మామూలే కదా. ఆ భయాలతోనే కదా ఇన్నాళ్లు పడి ఉన్నారు.

స్త్రీల మంచి కోసం ఎన్నో ఉద్యమాలు నడిచాయి, నడుస్తున్నాయి. మహిళలే ఉద్యమాలు చేసినా, మగవాళ్ళ నుండి, సమాజం నుండి కూడా మద్దతు దొరికింది, దొరుకుతోంది. ఫలితంగా ఆడవాళ్లు, ఆడపిల్లలు నోరు విప్పగలుగుతున్నారు. కొన్ని భయాలు, సందేహాలు ఉన్నప్పటికీ. 'న్యాయం దొరుకుతుందో లేదో...చావో రేవో కానీ! ఏదైతే అది అయ్యిందిలే తీయి' అన్నలెక్కో.

ప్రస్తుతానికి వస్తే 'ఫోగట్ సిస్టర్స్'లో ఒకరైన వినేష్ ప్రధానమంత్రికే విన్నవించుకున్నదట. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు తెచ్చిన వాళ్ళం కదా, కష్టాలు చెప్పుకుంటే ప్రధానమంత్రి తీరుస్తారనుకుందేమో పాపం. రాజకీయ నాయకులు గురించి, అధికార బలం గురించి తెలియదు కదా. అందునా కుస్తీ పోటీల్లో ఉన్న ఆడపిల్ల కదా. కాస్త ధైర్యం ఎక్కువే కావచ్చు. కానీ లోకం తీరు తెలియని పిల్లలు. తీరా చూస్తే న్యాయానికి బదులు అదిరింపులు, బెదిరింపులు. అందరూ జంతర్ మంతర్ దగ్గర ధర్నాలు చేస్తున్నారు కదా, మనకి మాత్రం న్యాయం జరగకపోతుందా అనుకున్నారు. ఇప్పటికి నాలుగు నెలలు గడిచాయి. సీజన్ జీరో డిగ్రీల టెంపరేచర్ నుండి 40 డిగ్రీల టెంపరేచర్‌కు మారింది. న్యాయం మాత్రం దొరకలేదు. ఇలా ఉంది ప్రభుత్వాల తీరు. అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లకే ఇలా ఉంటే ఇక సామాన్యుల మాట చెప్పాలా.

'బలుపు, కండకావరం' వంటి పదాలు పత్రికల్లో వాడటానికి కొంచెం ఇబ్బందిగా ఉంటుంది. స్త్రీల పట్ల అనుచితంగా ప్రవర్తించడం ఒళ్ళు బలిసినతనాన్నే సూచిస్తుందనుకోవాలి. స్త్రీలను లొంగతీసుకోవడమే మగతనం అనుకునే ధోరణి సొసైటీలో పాతుకు పోయింది. ఇక ధన బలం, అధికార బలానికి సొసైటీలో పేరు ప్రతిష్టలు తోడైతే ఇంకా హద్దు పద్దు ఉండదు. అత్యాచారాలు, ఆ పై హత్యలు, కిరసనాయిలు పోసి కాలబెట్టడాలు వంటివి టీవీల్లోనూ, పేపర్లలోను వచ్చినప్పుడు మాత్రమే గుండెలు బాదుకుంటాం. అయితే వాటికి మూలం ఎక్కడుంది? స్త్రీలను చూసే దృష్టిలోనే ఉందనేది అర్థం కావడం లేదు చాలామందికి. ఆ 'చాలా మందిలో' కుటుంబ సభ్యులు కూడా ఉంటున్నారు.

ఈ మధ్య ఒక వ్యాసం చదివాను. భారత దేశంలో ఆడవాళ్లకు పిన్నీసులు, పక్క పిన్నులే గొప్ప ఆయుధాలంట. నిజమే. ఒంటరిగానైనా, జంటగానైనా, రాత్రి గాని, పగలుగాని, బస్సులో గాని రైల్లో గాని ప్రయాణం చేసేటప్పుడు ముక్కు మొఖం తెలియని వాళ్ళ వేధింపులకు గురికాని ఆడదంటూ మన దేశంలో లేదేమో. అపరిచితుల స్పర్శకి ఉలిక్కిపడి లేవడం, పిన్నీసులు తీసి గుచ్చటం, గమ్యం చేరే దాకా పళ్ళ బిగువున కాలం గడపటం-ఇలా ఎన్నిసార్లని చెప్పాలి. నేను కూడా ఇందుకు మినహాయింపు కాదు.

ఇప్పటి విషయానికి వద్దాం. ఫోగట్ సిస్టర్లుగా పేరుపొందిన బబిత ఫోగట్, గీత, రీతు, ప్రస్తుత పోరాటంలో ఉన్న సాక్షి, సంగీత, వినేష్ ఫోగట్ లు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించటం, అదే అంశంపై 'దంగల్' సినిమా రావడం అందరికీ తెలిసిందే. ఆ తరువాత హర్యానా, పశ్చిమ యు.పి వంటి ప్రాంతాల్లో, గ్రామాల్లో కూడా కుస్తీ నేర్పించే అకాడమీలు పెరిగాయి. కొన్ని వందల మంది మగపిల్లలతో పాటు ఆడపిల్లలు కూడా కుస్తీ నేర్చుకుంటున్నారు. తల్లిదండ్రుల ఇష్టంతో సంబంధం లేకుండా తాను ఇష్టపడ్డ వాడిని కులం గోత్రం చూడకుండా పెళ్లి చేసుకుందని కూతుర్ని, అల్లుడిని కుల దురహంకార హత్యలు చేయించే నేల మీదే ఆడపిల్లలు కుస్తీ నేర్చుకొని పతకాలు తేవడం గొప్ప విషయమే. అందరూ మెచ్చుకునేదే. అయితే ఈ పోటీల్లో పైకి రావడం మాత్రం తల్లిదండ్రులకు శక్తికి మించిన పని. ఉన్నదంతా కర్పూరంలా కరిగిస్తే గాని మధ్యతరగతి పిల్లలు ఆ స్థితికి రాలేరు. సాక్షి మాలిక్ తల్లి ఒక ఐసిడిఎస్ సూపర్‌వైజర్. ఈ స్థితిలో ఎన్నైనా ఓర్చుకొని కొనసాగడమా లేక తిరిగి ఇంటికి వెళ్లిపోవడమా అనేది ప్రశ్న.

ఆడపిల్లలపై వేధింపులు మామూలుగా చెప్పుకునేట్లు లేవు. శ్రుతి మించి కంట్రోల్ తప్పిన స్థితిలోనే తెగించి జంతర్‌మంతర్ దారి పట్టారు. ఎంతకీ న్యాయం జరగకపోవడంతో సహజంగానే హర్యానా, పంజాబ్, పశ్చిమ యు.పి ప్రాంతాల్లో గ్రామీణ రైతు స్త్రీ పురుషులు కూడా తీవ్రంగా స్పందిస్తున్నారు. గ్రామాల నుండి స్త్రీ పురుషులు ప్రతిరోజు వందల సంఖ్యలో వచ్చి మద్దతు ఇస్తున్నారు. ఆడపిల్లల్ని అక్కున చేర్చుకొని ఆశీర్వదిస్తున్నారు. అలా సాక్షి , వినేష్ లను వాత్సల్యంతో అక్కున చేర్చుకోవడం నేను ఎన్నోసార్లు చూశాను. కారణం ఈ సమస్య తమ కుటుంబాల్లో ఉన్న పిల్లల సమస్య కూడా కావడమేమో.

'తోటకూర నాడే ...చెప్పకపోయావా' అని తెలుగులో సామెత. కుటుంబం గానీ, తోటి వారు గానీ, సమాజం గానీ మొదలే స్పందించి ఉంటే, పరువు పోతుందనే భయాన్ని పక్కనపెట్టి తల ఎత్తి, నోరు తెరిచి ప్రశ్నించే తత్వాన్ని మన ఆడపిల్లలకు ఇచ్చి ఉన్నట్లయితే పరిస్థితి కొంత మెరుగ్గా ఉంటుందేమో.

కోర్టులు ఎన్ని తీర్పులు ఇచ్చినా ఎన్ని మొట్టికాయలు వేసినా మారాల్సింది మన సంఘం తీరు. మన రాజకీయ నాయకుల తీరు. రాజకీయాలను, నాయకులను మనం చూసే తీరు. భ్రష్టు పట్టిన నాయకులకు ఎప్పుడైతే రొమ్ము విరుచుకొని, మీసాలు మెలేసి తిరగకుండా చెప్పులతో ఎప్పుడు సత్కారాలు దొరుకుతాయో అప్పుడే ఈ సమాజం బాగుపడేది. అటువంటి నాయకులను దేవుళ్ళుగా ఆరాధించినన్నాళ్లు, 56 అంగుళాల ఛాతీలు విరుచుకొని తిరగనిచ్చినన్నాళ్లు మన సమాజంలో మార్పు రాదు!

(వ్యాసకర్త ఐద్వా జాతీయ కోశాధికారి)

పాలక వర్గాలను భయపెడుతున్న కమ్యూనిజం!

అంతర్జాతీయం



ఎం. కోటేశ్వరరావు

కమ్యూనిజం గురించి ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు, విద్వేషాన్ని రెచ్చగొట్టినా జన జీవితాలు దుర్భరం అవుతున్నపుడు ప్రత్యామ్నాయాల గురించి జనం ఆలోచిస్తారు. అమెరికాలో, ఐరోపాలో, ఇతర చోట్ల ఇప్పుడు జరుగుతోంది అదే. గతంలో కమ్యూనిజం వైఫల్యం గురించి చర్చకు తెరతీస్తే సోషలిజం అంతరించింది అని చెప్పిన చోట జనం పెట్టుబడిదారీ విధాన వైఫల్యం గురించి ఆలోచించటం మొదలు పెట్టారు. 175 ఏళ్ల నుంచి 'కమ్యూనిస్టు ప్రణాళిక' దోపిడీ వర్గాన్ని భయకంపితం గావిస్తుంటే ఇప్పుడు పెట్టుబడిదారీ విధాన వైఫల్యంపై చర్చ కూడా దానికి తోడైంది. దాన్ని పక్కదారి పట్టించేందుకే మేము కూడా మీ గురించి ఆలోచిస్తున్నామని కార్మిక వర్గానికి చెప్పేందుకు భిన్నత్వం, న్యాయం లేదా ధర్మం, అంతర్గ్రహణం (డిఇఐ) భావనలను ముందుకు తెస్తున్నారు. అమెరికా లోని అనేక నగరాల్లో తమకు సరైనదారి చూపేది పురోగామి శక్తులే అనే భావం బలపడుతోంది. మూడో పెద్ద నగరమైన చికాగో లో మితవాదులను పక్కకు పెట్టి పురోగామి వాదులను నగర పాలక సంస్థకు ఎన్నుకోవటం దాన్నే సూచిస్తోంది.

అమెరికాలో న్యూయార్క్, లాస్ ఏంజల్స్ తరువాత మూడో పెద్ద నగరమైన చికాగో మేయర్‌గా పురోగామివాది బ్రాండన్ జాన్సన్ ఏప్రిల్ నాలుగవ తేదీన ఎన్నికయ్యాడు. చికాగో టీచర్స్ యూనియన్, కార్మిక నేతగా పని చేస్తున్నారు. మే పదిహేనవ తేదీన ప్రమాణ స్వీకారం చేశాడు. యాభై మంది కౌన్సిలర్లలో నగర చరిత్రలో పురోగామి వాదులు ఎక్కువగా ఎన్నికైన సందర్భమిదే. నిబంధనల ప్రకారం నగర పోలీసు కమిషనర్ పదవికి నగరం లోని 22 పోలీసు డివిజన్ల నుంచి వివిధ సామాజిక తరగతుల సమూహాల నుంచి ఎన్నికైన 60 మంది కమిటీ ముగ్గురు అధికారుల పేర్లను ఎంపిక చేసి సిఫార్సు చేస్తే వారిలో ఒకరిని మేయర్ ఎంపిక చేస్తారు. పోలీసు విభాగాన్ని కూడా ప్రజాస్వామ్య పద్ధతుల్లో పని చేసేట్లు చూస్తున్నారు. వచ్చే ఏడాది పాఠశాలల కమిటీలను కూడా ఎన్నికల ద్వారా నింపుతారు. ప్రజా ఉద్యమాల ప్రభావం, ప్రజానుకూల రాజకీయాలు, ఎన్నికల పట్ల పౌరుల ఉత్సాహంతో చికాగో నగరం మరింత ప్రజాస్వామిక వాతావరణంలో పురోగమించనుంది. ఇటీవలి కాలంలో అనేక నగరాలలో పురోగామి శక్తులు మేయర్లుగా ఎన్నిక అవుతున్నారు. వారంతా ప్రజా ఉద్యమాలలో పని చేసి ప్రజాదరణ పొందిన వారే. చికాగోలో గతంలో అధికారంలో ఉన్న వారు అనుసరించిన విధానాల ఫలితంగా ధనికులకు మెరుగైన వసతులు, కార్మికులకు దుర్భర పరిస్థితులు, అవినీతి, అక్రమాలు, నేరాలతో జనం విసిగిపోయారు. కేంద్రం, రాష్ట్రాల నుంచి నిధులను రాబట్టి నగర జీవనాన్ని మెరుగు పరచాలన్న ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా ఎన్నికల్లో పురోగామి శక్తులు నెగ్గారు. నగరంలోని 50 వార్డులకు గాను జాన్సన్ మద్దతుదారులు 29 మంది గెలిచారు. ఆఫ్రికన్-అమెరికన్ ఓటర్లలో 80 శాతం, తెల్లవారిలో 39, లాటినోలలో 49 శాతం మంది వారికి ఓటు వేశారు. ఇటీవలి కాలంలో ఆసియన్-అమెరికన్ జనాభా కూడా పెరుగుతోంది. ఎన్నికైన వారిలో ఆరుగురు డెమొక్రటిక్ సోషలిస్టులు కూడా ఉన్నారు. వారి నేత బెర్నీ శాండర్స్ రెండు సార్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు.

> **ఇటీవలి కాలంలో అనేక నగరాలలో పురోగామి శక్తులు మేయర్లుగా ఎన్నిక అవుతున్నారు. వారంతా ప్రజా ఉద్యమాలలో పని చేసి ప్రజాదరణ పొందిన వారే. చికాగోలో గతంలో అధికారంలో ఉన్న వారు అనుసరించిన విధానాల ఫలితంగా ధనికులకు మెరుగైన వసతులు, కార్మికులకు దుర్భర పరిస్థితులు, అవినీతి, అక్రమాలు, నేరాలతో జనం విసిగిపోయారు. కేంద్రం, రాష్ట్రాల నుంచి నిధులను రాబట్టి నగర జీవనాన్ని మెరుగు పరచాలన్న ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా ఎన్నికల్లో పురోగామి శక్తులు నెగ్గారు. నగరంలోని 50 వార్డులకు గాను జాన్సన్ మద్దతుదారులు 29 మంది గెలిచారు.**

బ్రాండన్ జాన్సన్

ఏప్రిల్ 23వ తేదీన ఐరోపా దేశమైన ఆస్ట్రియాలోని సాల్జ్‌బర్గ్ రాష్ట్ర ఎన్నికల్లో కమ్యూనిస్టులు (కెపిఓ) 11.7 శాతం ఓట్లు సంపాదించారు. ఐదు సంవత్సరాల క్రితం వారికి వచ్చిన ఓట్లు కేవలం 0.4 శాతమే. మితవాదానికి కేంద్రంగా ఉన్న ఇక్కడ ఇన్ని ఓట్లు రావటం పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. కెపిఓ ప్లస్ పేరుతో స్వతంత్రులను కూడా కలుపుకొని ఒక మ్యూజియంలో గైడ్‌గా పని చేస్తున్న 34 సంవత్సరాల కె మైఖేల్ డంకల్ అనే కార్మికుడి నేతృత్వంలో పార్టీ పోటీ చేసింది. మొదటి స్థానంలో ఉన్న పార్టీకి 30, రెండో స్థానంలో ఉన్న పార్టీకి 25 శాతం చొప్పున వచ్చాయి. డంకల్ గతంలో గ్రీన్స్ పార్టీలో పని చేశాడు. వర్గ రాజకీయాలను అనుసరించటం లేదని, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కూడా లేదని 2017లో రాజీనామా చేసి కమ్యూనిస్టులతో కలిశాడు. తరువాత 2019లో స్లాజ్‌బర్గ్ నగర ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలిచాడు. కమ్యూనిస్టు పార్టీ ఓట్లు అంతకు ముందున్న 1.19 నుంచి 21.5 శాతానికి పెరిగాయి. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో ఆస్ట్రియాలో నాలుగో పెద్ద నగరమైన ఈ నగర మేయర్‌గా ఒక కమ్యూనిస్టు ఉండబోతున్నట్లు విశ్లేషణలు వెలువడ్డాయి. దేశమంతటా పార్టీ ఓటింగ్ 2019లో ఒకటి నుంచి ఏడు శాతానికి పెరగ్గా 1959 తరువాత 2024 ఎన్నికల్లో తొలిసారిగా పార్లమెంటులో కూడా ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంది. ఇళ్ల సమస్య, అద్దెలు, ఇంధన ధరల పెరుగుదల వంటి రోజువారీ కార్మికుల సమస్యల మీద కేంద్రీకరించి పార్టీ ప్రజల అభిమానం పొందింది. అధికార కూటమి జనం నుంచి దూరమైంది. 2021లో జరిగిన ఎన్నికల్లో దేశంలో రెండో పెద్ద నగరమైన గ్రాజ్ మేయర్‌గా కమ్యూనిస్టు ఎన్నికయ్యాడు. గ్రీసులో జరిగిన విశ్వవిద్యాలయాల విద్యార్థి సంఘ ఎన్నికల్లో వామపక్ష భావజాలం కలిగిన వారు 35 శాతం ఓట్లు తెచ్చుకున్నారు. వరుసగా రెండవ ఏడాది ఈ ఆదరణ లభించింది. ఈ వీధులు ఎవరివి? మావే, ఈ భూములు ఎవరికి, స్థానికులం మావే, వేరే వారికి అప్పగించటాన్ని అంగీకరించం అంటూ అమెరికా లోని మినియా పోలీస్‌లో జరిపిన ప్రదర్శనల్లో స్థానికులు కమ్యూనిస్టు, సోషలిస్టు పతాకాలను చేబూని నినదించారు. పురోగామి శక్తులు ఎన్నికల పోరాటాలతో పాటు ప్రజా ఉద్యమాల్లోనూ ముందుంటున్నారు. లాటిన్ అమెరికాలో రాగల ముప్పును గురించి కూడా హెచ్చరిస్తున్నారు.

తమ దేశ ప్రజాస్వామ్య భవిష్యత్ ప్రమాదంలో పడిందని చిలీ కమ్యూనిస్టు పార్టీ హెచ్చరించింది. దేశ నూతన రాజ్యాంగ రచనకు ఏర్పాటు చేసిన 50 మంది సభ్యుల సభకు మే ఏడవ తేదీన జరిగిన ఎన్నికల్లో మితవాద, తీవ్రవాదుల పార్టీలకు చెందిన వారు 33 మంది ఎన్నిక కావటాన్ని కమ్యూనిస్టు పార్టీ ఉటంకించింది. ఆ ఎన్నికల్లో రెండు స్థానాలను పొందిన పార్టీకి ఎనిమిది శాతం ఓట్లు వచ్చాయి. అక్కడి నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేయాల్సి ఉంది. పోలైన ఓట్లలో 21 శాతం చెల్లనివిగా ప్రకటించారు. ఇవన్నీ కూడా వామపక్ష శక్తులుగా చెప్పుకొనే వారివేనని, వారంతా వామపక్షాలకు ఓట్లు వేసి ఉంటే ఫలితాలు వేరుగా వచ్చి ఉండేవని కమ్యూనిస్టు పార్టీ చిలీ అధ్యక్షుడు గులిరెమో టెలియర్ అన్నారు. నూతన రాజ్యాంగ రచనకు ఎంతో గట్టి పోరాటం చేయాల్సి ఉంటుందని అన్నారు. కార్పొరేట్ శక్తులు రంగంలోకి దిగి పెద్ద ఎత్తున కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం చేసినప్పటికీ దేశంలో ఓట్ల రీత్యా మూడవ స్థానంలో పార్టీ నిలిచిందని చెప్పారు. 2021 ఎన్నికల్లో గెలిచిన వామపక్ష గాబ్రియెల్ బోరిక్ ప్రభుత్వానికి తాజా పరిణామంతో ఎలాంటి ముప్పు లేనప్పటికీ కీలకమైన రాజ్యాంగ రచనకు ఓటర్లు మితవాద శక్తుల వైపు మొగ్గు చూపటం గమనించాల్సిన అంశం. మొత్తం లాటిన్ అమెరికా, ప్రపంచంలోని కమ్యూనిస్టు, వామపక్ష శక్తులు చిలీ పరిణామాల నుంచి గుణపాఠాలను నేర్చుకోవాల్సి ఉంటుంది.

సెటైర్

ఓ హిందూ పాలకుని స్వగతం

ఆహో! ఏమిది! గాఢాంధకారం అలముకున్నది?

డబుల్ ఇంజన్ సర్కార్‌కు పతనమారంభించెనా...! తేజోవంతమైన మా ప్రకాశము ఇక మసకబారునా..? ఎన్నెన్ని ఎత్తులు. పై ఎత్తులు, వ్యూహాలు, ప్రతివ్యూహాలు, కడకు ఎవరు గెలిచినా అధికార పీఠం అధిష్టించేది తాముగాక మరెవ్వరూ? అని విర్రవీగుతున్న తమకే పాఠం నేర్పే ఓటరున్నాడా..? హతవిధి!

అవును ఉన్నాడు. ఉన్నాడు గనుకనే పరిపూర్ణ మెజార్టీ ప్రత్యర్థికి కట్టబెట్టాడు. ప్రతిపక్ష నేతలను అంచనా వేసితిమి గాని ఆఫ్ట్రాల్ ఓ ఓటర్ని అంచనా వేయలేకపోతిమా..?

ఆ... నా యోగము, నా ధ్యానము, నా నటనా సామర్థ్యమూ, వన్నెతెచ్చే వన్‌సైడ్ వాగ్భూషణమూ అన్నీ ఇక వ్యర్థమేనా.

ఆ ం... ఎచటివారు... ఎక్కడివారు... ఈ ముస్లిం మైనారిటీలు, మూడు దశాబ్దాల కింద నాటి జనతాదళ్ సెక్యులర్ ప్రభుత్వం వీరికి కల్పించిన నాలుగుశాతం రిజర్వేషన్లు మా ప్రభుత్వం తొలగించి, వొక్కలిగ, వీరశైవులకు కేటాయించాలని చేసిన నిర్ణయం కన్నడ ఓటరుకు, అదియునూ హిందూ ఓటరుకు ప్రీతిపాత్రము కాలేదా? ఏమీ దుర్గతి? మరిక ముస్లిం ఓటర్లను బెదిరించుటెట్లు? భయపెట్టుటెట్లు? ఉక్కుపాదంతో అణచవలెనన్న యోచనను భంగపరిచితిరే...

హిందూత్వ పెట్టుబడి రాజకీయాలకు తూట్లు పడుటలేదు కదా..? ప్రతీఘాత ఆలోచనలు ప్రతిహతమౌ గాక.

ఛీ... ఛీ... అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ అధికారం ఉన్నా ఫలితం లేకపోయెనే? ఇది స్వయంకృతాపరాధం కాదు కదా? మరి అంతులేని ధనం... కార్పొరేట్‌రంగం ఏమైంది? తామే మేము, మేమే తాము అన్న రీతిలో కార్పొరేట్ రంగాన్ని భుజాన వేసికొంటిమే. మరి ఈ కీలక సమయంలో వారు మా అండ నుండి గట్టెక్కించవలెను కదా..? ఏమయ్యారు వారు?

లేక వారి బండారాన్నీ కనుగొంటున్నాడా ఓటరు. ఓటరుకు అంత తెలివి వచ్చినదా? కనుకనే ఎవ్వరూ ఊహించని తీర్పు నిచ్చాడా..? హంగ్ ఊహాగానాలకే తెర దించాడు. కింగ్ మేకర్లకు స్థానం లేకుండా చేశాడు ఈ ఓటరు. ఏమిది? నేను ఓటరును పొగడటం లేదు కదా!

ప్రచారంలో భూసురునిగా భావించి పూలు జల్లారే. కాళ్ళకు మొక్కారే. ఆ భక్తి పారవశ్యం ఇంకనూ కళ్ళలో మెదులుతున్నది. నా నటనకు ప్రతినటన కాదు కదా! కాదు.. కాదు... వారి నిజాయితీ, అమాయకత్వము లవలేశము శంకించ జాలము. కనుకనే దాదాపు గత శాతం ఓట్లు దక్కనే దక్కాయి. సీట్లు తప్ప.

ప్రత్యర్థి గెలుపునకు వారి పంచ సూత్ర ప్రణాళికా పథకమే కీలకమా? గృహజ్యోతి పథకం-ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్, గృహ లక్ష్మి పథకం-యాజమాన్య గృహిణులకు రెండు వేల రూపాయల ఆర్థిక సహాయం, అన్న భాగ్య పథకంగా నిరుపేదలకు 10 కిలోల ఉచిత బియ్యం, యువనిధి యోజన పథకం ద్వారా పట్టభద్ర నిరుద్యోగికి నెలకు మూడువేల రూపాయలు, డిప్లమో వారికి పదిహేను వందలు, ఆర్టీసీలో పేద మహిళకు ఉచిత ప్రయాణ పథకం...

ఏమిది, వారి ఎన్నికల ప్రణాళిక పథకాలను నేను ఏకరువు పెడుతుంటిని? ఆ...లోతుగా చూసిన...ఈ ప్రణాళికలో యువజన, మహిళా సాధికారితా అంశాలు గోచరిస్తున్నవి సుమా...

మరి మా ఎన్నికల ప్రణాళిక ఏమైంది? మేమూ ఉచితాలు వాగ్దానాలు చేసితిమే. అయినా మా ప్రభుత్వ చేతలే మా ప్రణాళిక. ఎవరికైనా ఆచరణే కదా గీటురాయి. భళా! మా చేతలే మా మాటలు. మా చేతలను విశ్వసించిన వారే మాకు ఓట్లు వేసితిరి.

వైదిక ధర్మ ప్రభోదకుల మత భావోద్వేగాలు కన్నా...కూడు, గుడ్డ, నీడ వంటి తుచ్ఛమైన కనీస అవసరాలవైపే ఈ ఓటరు మొగ్గు చూపుతున్నాడంటే... మన పాలనను మెరుగు పరుచుకోక తప్పదు గాక తప్పదు.

జై భజరంగ భళి... హిజాబ్ వ్యవహారం హిందూ ఓటర్లను ఉద్దీపన గావించడం లేదా? 40 శాతం కమిషన్ల వ్యవహారం హిందూ ధర్మానికి ఆటంకం అవుతున్నదా..?

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు మా భారత్ తోడో విధానాలు సమాధానం కావా..? కిం కర్తవ్యం?

వ్యూహం మార్చాలా? ఉన్న విధానాలు మొరటుగా కొనసాగించాలా..?

అదియునూ చూసెదము.

విద్వేష దుకాణం బందై ప్రేమ దుకాణం తెరిచింది అని అరచేవారికి పాఠం చెప్పెదను. క్రోనీ కేపిటలిజంపై పేదల విజయ బావుటా! అనే వారికి కూడా సమాధానం ఇవ్వవలసిన అగత్యం ఏర్పడింది.

ముందున్నది ముసళ్ళ పండుగ. ఎప్పటికైనా ఈ దేశం మాది అంటే హిందువులది అనుకుంటున్నాం మేం. దేశం అంటే సింహాసనం అని వేరే చెప్పాలా..?

ఓటర్లది మాత్రమే భారతదేశం. అదీ ప్రజాస్వామ్య దేశం... హా...హా...హా...!

- కె. శాంతారావు,
సెల్: 9959745723

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

భారత్‌లో మత హింస పెరుగుతోంది

- దోషులకు కొమ్ము కాస్తున్నారు
- మానవ హక్కులకు భంగం కలుగుతోంది
- రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు
- నివేదికలో అమెరికా విదేశాంగ శాఖ ఆందోళన

న్యూఢిల్లీ : భారత్‌లో క్రైస్తవులు, ముస్లింలు, సిక్కులు, హిందూ దళితులు సహా మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని నిరంతరం దాడులు జరుగుతూనే ఉన్నాయని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. ఈ మేరకు 'అంతర్జాతీయ మత స్వేచ్ఛ'పై సోమవారం ఒక నివేదిక విడుదల చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే నెల 22న అమెరికాలో పర్యటిస్తున్న నేపథ్యంలో విడుదలైన ఈ నివేదిక ప్రాధాన్యతను సంతరించుకుంది. నివేదికలో ప్రస్తావించిన విషయాలు తనను నిరాశకు గురి చేశాయని అమెరికా విదేశాంగ శాఖ అధికారి ఒకరు తెలిపారు.

భారత్‌లో మానవ హక్కుల పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నామని, అక్కడ పెద్ద ఎత్తున మైనారిటీలను హతమారుస్తున్నారని, ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఆ అధికారి చెప్పారు. మైనారిటీలపై మూకుమ్మడి హత్యాకాండ జరుగుతున్న 162 దేశాలలో భారత్ ఎనిమిదో స్థానంలో ఉందని ఆయన వివరించారు. ముస్లింలను ఊచకోత కోయాలని, హింసించాలని బాహాటంగానే పిలుపు ఇస్తున్నారని, తద్వారా హింసను ప్రేరేపిస్తున్నారని అమెరికా విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రార్థనా స్థలాలపై దాడులు, నివాసాల కూల్చివేత వంటి ఘటనలను ప్రస్తావించింది. మైనారిటీలపై దాడులు చేసిన దుండగులను కాపాడుతున్నారని, కొన్ని సందర్భాలలో క్షమాభిక్ష ప్రసాదిస్తున్నారని తెలిపింది.

2002లో బిల్కిస్ బానోపై జరిగిన లైంగిక దాడి కేసులో యావజ్జీవ శిక్ష పడిన 11 మంది ముద్దాయిలు పెట్టుకున్న క్షమాభిక్ష దరఖాస్తును గుజరాత్ ప్రభుత్వం గత ఆగస్ట్ 15న ఆమోదించింది. జైలులో వారి ప్రవర్తన బాగా ఉందన్న కుంటిసాకు చూపి వారిని విడుదల చేశారు. ఇదే విషయాన్ని గుజరాత్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. లైంగిక దాడి చేసిన వారిలో ఒకరు పెరోల్‌పై బయటికి వచ్చి ప్రతీకార దాడికి పాల్పడ్డాడంటూ అతనిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. ఈ ఘటనను అమెరికా విదేశాంగ శాఖ తన నివేదికలో ప్రస్తావించింది.

మతపరమైన వస్త్రధారణపై ఆంక్షలు విధించడాన్ని కూడా నివేదిక ఎత్తిచూపింది. కర్నాటకలోని బీజేపీ ప్రభుత్వం గత సంవత్సరం ఫిబ్రవరి ఐదున హిజాబ్ ధారణపై నిషేధం విధించడాన్ని కూడా నివేదిక ప్రస్తావించింది. హిజాబ్‌ను ధరించడం సమానత్వం, సమగ్రతలకు భంగకరమని ప్రభుత్వం వాదించింది. హిజాబ్ ధరించి విద్యా సంస్థలకు హాజరైన విద్యార్థులకు అనుమతి నిరాకరించారు. బీజేపీ మాజీ సభ్యులు నుపుర్ శర్మ, నవీన్ జిందాల్ టీవీలో మహమ్మద్ ప్రవక్తపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన తర్వాత భారత్‌లోని పలు ప్రాంతాలలో చోటుచేసుకున్న హింసాత్మక నిరసన ప్రదర్శనలను కూడా నివేదికలో వివరించారు. బీజేపీ సభ్యుల వ్యాఖ్యలను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్, ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోపరేషన్, ప్రభుత్వ అధికారులు ఖండించిన తర్వాత వారిని బీజేపీ బహిష్కరించింది.

చట్టాన్ని అమలు చేసే ప్రభుత్వ అధికారులే గత సంవత్సరం పలు రాష్ట్రాలలో మైనారిటీలపై హింసకు పాల్పడ్డారని నివేదిక తెలిపింది. గత అక్టోబరులో జరిగిన పండుగ సందర్భంగా హిందూ భక్తులను గాయపరిచారని ఆరోపిస్తూ సివిల్ దుస్తులు ధరించిన గుజరాత్ పోలీసులు నలుగురు ముస్లింలను కొరడాలతో కొట్టారని పేర్కొంది. భారత్‌లో నెలకొన్న పరిస్థితిపై మానవ హక్కుల సంస్థలు సహా అంతర్జాతీయ సమాజం దృష్టి సారించిందని చెప్పింది.

'భారత్‌లో పరిస్థితిపై మేము మా సహచరులతో నేరుగా మాట్లాడాము. హింసను ఖండించాలని, హింసకు బాధ్యులైన దుండగులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న పౌర సమాజ సహచరులతో కలిసి పని చేస్తున్నాము. హింసకు సంబంధించి ఆధారాలు సేకరిస్తున్న పాత్రికేయులతో కూడా మాట్లాడుతున్నాం' అని విదేశాంగ శాఖ అధికారి చెప్పారు. 2021లో కూడా భారత్‌లో మైనారిటీలపై జరుగుతున్న హింసపై అమెరికా విదేశాంగ శాఖనివేదిక విడుదల చేయటం గమనార్హం.

ఐక్యంగా బిజెపిని ఓడిద్దాం

- లౌకిక పార్టీలకు ఏచూరి పిలుపు
- తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో భేటీ

చెన్నయ్ : మత విద్వేషాలను రెచ్చగొడుతూ, కార్పొరేట్ అనుకూల విధానాలు అమల్జేస్తున్న బిజెపిని ఓడించేందుకు లౌకిక పార్టీలు అన్నీ కలిసికట్టుగా ముందుకు రావాలని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. మంగళవారం నాడు ఆయన తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం విలేకర్లతో ఏచూరి మాట్లాడారు. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యంగా కృషి చేసి బిజెపిని ఓడించాలని ఆయన కోరారు. కర్ణాటకలో బిజెపి ఘోర ఓటమి తర్వాత దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితిపై స్టాలిన్, తాను చర్చించామని ఏచూరి తెలిపారు. బిజెపిని ఓడించేందుకు ఒకరినొకరు సహరించుకొని పనిచేయాలనుకునే వివిధ పార్టీల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయి. మంచి భారతావనిని నిర్మించేందుకు బిజెపి ఓటమి తప్పనిసరి. మతోన్మాద ఫాసిస్టు శక్తులను ఓడించితీరాలి' అని ఆయన కోరారు. ఇలాంటి శక్తులకు వ్యతిరేకంగా తమిళనాడులో లౌకిక పార్టీలన్నీ కలిసికట్టుగా కృషి చేస్తున్నాయని, అలాగే ప్రతి రాష్ట్రంలోనూ తమదైన ప్రత్యేక లక్షణాలతో బిజెపి ఓటమికి కృషి చేయాల్సివుందని ఏచూరి తెలిపారు. బిజెపిని ఓడించేందుకు కేరళలో కూడా సిపిఎం నేతృత్వంలోని కూటమి, కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి పనిచేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యేక పరిస్థితులకు వీలుగా నిర్ణయాలు తీసుకోవాల్సివుంటుందని ఏచూరి తెలిపారు. ఏదేమైనా మతోన్మాద, కార్పొరేట్ అనుకూల బిజెపిని ఓడించడమే ప్రతిపక్షాల ముందున్న తక్షణ కర్తవ్యమని ఆయన తెలిపారు. స్టాలిన్‌ను కలిసినవారిలో సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు కె బాలకృష్ణన్ కూడా ఉన్నారు.

తేలని కర్నాటకం !

(మొదటి పేజీ తరువాయి)

వారు తమ వాదనలను బలంగా వినిపించినట్లు తెలిసింది. పార్టీ విస్తృత ప్రయోజనాల కోసం శివకుమార్‌నే ముఖ్యమంత్రిగా ప్రకటించాలని ఆయన గ్రూపు వాదించింది. సిద్ధరామయ్య ఇప్పటికే ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారని, అయితే 2018లో ఆయన నేతృత్వంలో పార్టీ ఓడిపోయిందని, ఇప్పుడు ఆయన వయస్సు 76 ఏళ్లు అయినందున కొత్తవారికి అవకాశం ఇచ్చి హుందాతనం నిలుపుకోవాలని శివకుమార్ గ్రూపు వాదించినట్లు తెలిసింది. 2006లో కాంగ్రెస్‌లో చేరిన సిద్ధరామయ్యకు మరోమారు ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించి కెపిసిసి చీఫ్ (శివకుమార్) వంటి నిబద్ధత కలిగిన నేతను బలిపెట్టరాదని చాలా మంది సీనియర్లు వాదించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం..సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగానూ, ప్రతిపక్ష నేతగానూ పార్టీ కంటే తన స్వీయ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చారంటూ శివకుమార్ అధిష్టానం ఎదుట విన్నవించినట్లు తెలిసింది. ఆయన మూలానే పార్టీలో ముఠాలు పెరిగి, 2019 జులైలో రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వ ఏర్పాటుకు దారితీసిందని కూడా శివకుమార్ కేంద్ర నాయకత్వం ఎదుట వాపోయినట్లు సమాచారం. 'సిద్ధరామయ్య అనుచరులే ముఠాలుగా ఏర్పడి పార్టీపై చీలికలు తెచ్చారు' అని డికె శివకుమార్ పేర్కొన్నట్లుగా ఆయన సన్నిహితులు మీడియాకు తెలిపారు.

మంగళవారం మధ్యాహ్నం నుంచి మంతనాలు

అధిష్టానం పిలుపు మేరకు మంగళవారం మధ్యాహ్నం న్యూఢిల్లీ చేరుకున్న డికె శివకుమార్ పార్టీ అధినాయకులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. మంగళవారం సాయంత్రం ఖర్గేతో సమావేశమై తనకే ఎందుకు ముఖ్యమంత్రి పీఠాన్ని కట్టబెట్టాలో శివకుమార్ వివరించారు. ఖర్గేతో సమావేవం అనంతరం శివకుమార్ మీడియా ప్రతినిధులతో మాట్లడలేదు. అంతకుముందు కెపిసిసి చీఫ్‌గా తాను రాజీనామా చేసే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. ఢిల్లీ బయల్దేరే ముందు కెపిసిసి అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు కథనాలు వస్తున్నాయి కదా ! దీనిపై మీ స్పందన ఏంటంటూ మీడియా అడిగిన ప్రశ్నకు శివకుమార్ ఘాటుగా స్పందించారు. తాను పార్టీకి వెన్నుపోటు పొడిచే రకం కాదని చెప్పారు. 'మా పార్టీయే మా తల్లి. మాకు మేముగా పార్టీని నిర్మించుకున్నాం. రాజీనామా ప్రశ్నే లేదు' అని ఆయన చెప్పారు.

శివకుమార్ తర్వాత సిద్ధరామయ్య చర్చలు

మంగళవారం సాయంత్రం శివకుమార్‌తో ఖర్గే చర్చలు జరిపిన తర్వాత అప్పటికే ఢిల్లీ చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా అధిష్టానంతో చర్చలు జరిపారు. కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున ఖర్గేతో సహా పలువురు కేంద్ర నాయకులతో సిద్ధరామయ్య చర్చలు జరిపి తనదైన వ్యూహాలను సిద్ధం చేసుకున్నారు. కొత్తగా ఎన్నికైన 135 మంది ఎమ్మెల్యేల్లో మెజార్టీ మద్దతు తనకుందని సిద్ధరాయమ్య సోమవారం నాడే ప్రకటించారు. ఎఐసిసి ప్రధానకార్యదర్శి, కర్ణాటక ఇంఛార్జి రణదీప్ సూర్జేవాలా, ప్రధానకార్యదర్శి (సంస్థాగత) కెసి వేణుగోపాల్‌తోనూ సిద్ధరామయ్య విడివిడిగా సమావేశమయ్యారు.

రాహుల్, ఖర్గే మంతనాలు

కర్ణాటక వ్యవహారాన్ని సముతుల్యతతో కొలిక్కి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ పార్టీ జాతీయ అధ్యక్షులు ఖర్గే నివాసానికి మంగళవారం ఉదయమే చేరుకున్నారు. సీనియర్ నాయకులు వేణుగోపాల్, సూర్జేవాలాతో కలిసి ఖర్గేతో రాహుల్ కర్ణాటక నాయకత్వ అంశంపై మంతనాలు జరిపారు. ఏదేమైనా సిద్ధరామయ్య, శివకుమార్ గ్రూపులతో ఎవ్వరి ధీమా వారిదే. అగ్రనాయకత్వం తమకంటే తమకే పట్టం కడుతుందని ఇరువురి గ్రూపులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ముఠాలుగా పార్టీ చీలికలై చెల్లాచెదరు అయిన పరిస్థితిల్లో డికె శివకుమార్ చాకచక్యంగా వ్యవహారాన్ని కొలిక్కి తీసుకొచ్చి జవసత్వాలు నింపారనీ, పార్టీ సంస్థాగత ప్రధానకార్యదర్శి కెసి వేణుగోపాల్ ఈ విషయాన్ని దగ్గరుండి పరిశీలించారని అందువల్ల శివకుమార్‌కే ముఖ్యమంత్రి పీఠం ఖాయమని ఆయన గ్రూపు భావిస్తోంది. వొక్కలింగాలు, లింగాయత్‌లు వంటి సామాజిక తరగతుల నుంచి కూడా శివకుమార్‌కు విశేష మద్దతు ఉందని, అందువల్లే ఆయనకే అధిక అవకాశాలున్నాయన్నది వారి అంచనా. వ్యక్తిత్వ పలుకుబడి ఆధారంగా రాజకీయాలు ప్రభావితం చేయాలనేది సిద్ధరామయ్య శైలి అని అది కాంగ్రెస్‌కు చెల్లుబాటు కాదనేది కూడా వారి వాదనగా ఉంటోంది. అయితే కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల్లో సగానికి పైగా ఎమ్మెల్యేలు తమ నాయకుడికే మద్దతు ఇస్తున్నారని ఆయన సిద్ధరామయ్య గ్రూపు వాదిస్తోంది. మైనార్టీలు, ఓబిసిలు, దళితులను కలిసికట్టుగా 'అహిందాలు'గా తెరపైకి తీసుకొచ్చి ప్రజల్లోకి కాంగ్రెస్‌ను తీసుకెళ్లి జనాధారణ కలిగిన నేతగా సిద్ధరామయ్యకే అధిష్టానం పట్టం కడుతుందని విశ్వసిస్తున్నారు.

కొనసాగిన రెజ్లర్ల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అగ్రశ్రేణి రెజ్లర్లు చేస్తున్న ఆందోళన 24 రోజులు పూర్తి చేసుకుంది. ప్రముఖ నటుడు విందు దారా సింగ్ దీక్షా శిబిరాన్ని మంగళవారం నాడు సందర్శించి రెజ్లర్లకు మద్దతు తెలిపారు. మరోవైపు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. లండన్‌తో సహా వివిధ దేశాల్లోని ప్రముఖ నగరాల్లోనూ రెజ్లర్ల పోరాటానికి సంఘీభావంగా ప్రదర్శనలు చేపడుతున్నారు. ఈ ఆందోళనను జాతీయ ఉద్యమంగా మార్చాలని భీమ్ ఆర్మీ అధ్యక్షులు చంద్రశేఖర్ ఆజాద్ చేసిన సూచనపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని రెజ్లర్ సాక్షి మాలిక్ అన్నారు.

కేరళ పాఠశాలల్లో శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మిషన్లు

- ఎల్‌డిఎఫ్ మరో ఘనత

న్యూఢిల్లీ : సిపిఎం నేతృత్వ వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వ ప్రజానుకూల నిర్ణయాలతో నవ కేరళ దూసుకుపోతోంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్మికుల సంక్షేమ కోసం ప్రత్యేకంగా సహాయనిధిని ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రంగా ఖ్యాతినొందిన మరుసటి రోజే మరో ప్రజా సంక్షేమ కార్యాక్రమానికి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నడుంబిగించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మిషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ సామాజిక మాధ్యమాల్లో మంగళవారం నాడు ప్రకటించారు. నెలసరి రోజుల్లో ఆరోగ్యంగా, పరిశుభ్రంగా ఉండటమనేది బాలికల ప్రాథమిక హక్కు అని ఈ సందర్భంగా విజయన్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు బాలికలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేస్తుందని, వారి ఆరోగ్యాన్ని కూడా పరిరక్షిస్తుందని తెలిపారు. బాలికల సాధికారతకు ఈ ప్రాజెక్టు ఎంతో దోహదం చేస్తుందన్న ప్రగాఢ విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఇమ్రాన్ బెయిల్‌పై తీర్పు వాయిదా



లాహోర్ : పంజాబ్ ప్రావిన్స్‌లో తనపై నమోదైన అన్ని కేసుల్లోనూ బెయిల్ ఇవ్వాలని కోరుతూ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పెట్టుకున్న పిటిషన్‌పై లాహోర్ హైకోర్టు మంగళవారం తన తీర్పును రిజర్వులో ఉంచింది. ఇస్లామాబాద్ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌తో విడుదలైన మరుసటి రోజే ఖాన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆ బెయిల్ పిటిషన్ ప్రవేశపెట్టడానికి ఆమోదయోగ్యం కాదంటూ పంజాబ్ ప్రభుత్వం తరపు న్యాయవాది వ్యతిరేకించారు. ఇమ్రాన్ ఖాన్ కనీసం కోర్టుకు కూడా రాలేదని, కానీ, ప్రొటెక్టివ్ బెయిల్ మాత్రం కోరుతున్నారని అన్నారు. ఈ దశలో ఖాన్ తరపు న్యాయవాది జోక్యం చేసుకుంటూ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోరుతున్నారని, అంతేకానీ ప్రొటెక్టివ్ బెయిల్ కాదని చెప్పారు. ఈ కేసును విస్తృత ధర్మాసనానికి నివేదించాల్సిందిగా ఆయన కోరారు. 'రాజకీయంగా తాను వేధింపులకు గురవుతున్నానని, అనేక కేసుల్లో పోలీసులు తనను ఇరికించడంతో అరెస్టు చేసే ముప్పు వుందని' ఇమ్రాన్ తన బెయిల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. హింసను రెచ్చగొట్టడం, దేశద్రోహం ఆరోపణలకు సంబంధించిన రెండు కేసుల్లో జూన్ 8 వరకు ఇమ్రాన్ బెయిల్‌ను ఇస్లామాబాద్ హైకోర్టు పొడిగించింది. మే 9 తర్వాత నమోదైన మిగిలిన అన్ని కేసుల్లో బెయిల్ కోసం 15న లాహోర్ హైకోర్టును ఆశ్రయించాల్సిందిగా కోరింది.

97 శాతం మంది ఎమ్మెల్యేలు కోటీశ్వరులే !

- 55 శాతం మందిపై క్రిమినల్ కేసులు
- ఎడిఆర్ నివేదిక

శాసనసభకు ఎన్నికైన వారిలో అత్యంత సంపన్నుడు డికె శివకుమార్

బెంగళూరు : కొత్తగా ఎన్నికైన కర్ణాటక శాసనసభలో గెలుపొందిన అభ్యర్థుల్లో 97 శాతం మంది కోటీశ్వరులని, వారి సగటు ప్రకటిత ఆస్తుల విలువ రూ.64.39 కోట్లుగా వుందని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) తన విశ్లేషణలో పేర్కొంది. "గెలుపొందిన 223మంది అభ్యర్థుల వివరాలను విశ్లేషించగా, వారిలో 217 (97శాతం) మంది కోటీశ్వరులు. 2018లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత గెలుపొందిన 221 ఎంఎల్‌ఎల వివరాలను విశ్లేషించగా, వారిలో కూడా 215(97శాతం) మంది కోటీశ్వరులే." అని ఎడిఆర్ తన నివేదికలో పేర్కొంది. గెలుపొందిన అభ్యర్థుల క్రిమినల్ నేపథ్యం, ఆర్థిక హోదా, విద్య, జెండర్, ఇతర వివరాలను విశ్లేషించారు. ఎంఎల్‌ఎల సగటు ఆస్తుల విలువ దాదాపు రూ.30కోట్లు పెరిగింది. 2018లో ఇది రూ.34.59కోట్లుగా వుండగా, 2023లో రూ.64.39కోట్లుగా వుంది.

కాంగ్రెస్ పార్టీకి సంబంధించినంతవరకు 134 మంది విజేతల (135 సీట్లు గెలిచింది) వివరాలను విశ్లేషించారు. వారిలో 132 మది కోటీశ్వరులు. వారి సగటు ప్రకటిత ఆస్తుల విలువ రూ.67.13 కోట్లుగా వుంది. ఇక బిజెపి వివరాలు చూసినట్లైతే, 66 మంది విజేతల్లో 63 మందికి కోటి రూపాయిలపైనే ఆస్తులు వున్నాయి. వారి సగటు ఆస్తుల విలువ రూ.44.36 కోట్లుగా వుంది. జనతాదళ్ (సెక్యులర్) పార్టీ విజేతలు 19 మందిలో 18 మంది కోటీశ్వరులే, వారి సగటు సంపద విలువ రూ.46.01 కోట్లుగా వుంది.

విజేతల్లో కేవలం ఇద్దరి అభ్యర్థుల ప్రకటిత ఆస్తులే రూ.50లక్షల కన్నా తక్కువగా వున్నాయి. రూ.50 లక్షల నుండి రూ.2 కోట్ల వరకు ఆస్తి వున్నవారు 10 మంది వున్నారు, రూ.2-5 కోట్ల మధ్య ఆస్తి కలిగిన వారు 31 మంది వున్నారు. రూ.5 కోట్లకు పైగా ఆస్తులున్న వారు 180 మంది వున్నారని ఎడిఆర్ తన నివేదికలో పేర్కొంది.

ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నిస్తున్న డి.కె.శివకుమార్ అందరిలోకి అత్యంత సంపన్నుడు. ఆయన ఆస్తుల విలువ రూ.1413 కోట్లు. ఆ తర్వాత స్థానంలో గౌరిబిదనూర్ నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన కె.హెచ్.పుట్టుస్వామి వున్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.1267 కోట్లుగా వుంది. ఇక అత్యంత తక్కువగా ఆస్తి కలిగిన అభ్యర్థి సులియా నుండి గెలిచిన బిజెపి అభ్యర్థి భగీరథి మురుల్యా. ఆయన ఆస్తి రూ.28 లక్షలుగా వుంది. మరో బిజెపి విజేత, కృష్ణరాజకి చెందిన టి.ఎస్.శ్రీవత్స. సంపన్నుల జాబితాలో కింది నుండి రెండో స్థానంలో వున్నారు. ఆయన ఆస్తి విలువ రూ.48లక్షలు. మొత్తంగా 93 మంది ఎంఎల్‌ఎలు తిరిగి ఎన్నికయ్యారు. వీరిలో కాంగ్రెస్‌కు చెందినవారు 51మంది కాగా, బిజెపి నుండి 38 మంది, జెడి(ఎస్) నుండి నలుగురు వున్నారు. వారి సగటు సంపద రూ.29.03కోట్లనుండి రూ.71.52 కోట్లకు పెరిగింది. 2018లో రూ.42.48కోట్లుగా వుంది. తిరిగి ఎన్నికైన ఎంఎల్‌ఎల ఆస్తులు సగటున 68శాతం పెరిగాయి.

క్రిమినల్ కేసులు ..

గెలుపొందిన అభ్యర్థుల్లో దాదాపు మూడో వంతు మంది అంటే 71మంది తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు వున్నట్లు తమ ఎన్నికల అఫిడవిట్‌ల్లో ప్రకటించారు. కాంగ్రెస్‌లో 134మందిలో 40మంది (30శాతం) తీవ్రమైన క్రిమినల్ నేరాలు వున్నట్లు ప్రకటించారు. ఇక బిజెపిని చూసినట్లైతే 66మందిలో 23 మంది (35శాతం) విజేతలపై ఇటువంటి కేసులు వున్నాయి. జెడిఎస్ విజేతల్లో ఏడుగురు (37శాతం)విజేతలపై క్రిమినల్ కేసులు వున్నాయి. మొత్తంగా 122మంది తమకు క్రిమినల్ నేపథ్యం వుందని ప్రకటించగా, వారిలో 50శాతం మంది అంటే 51మంది చిన్నా చితకా కేసులు నమోదైన వారు వున్నారు. నంజన్‌గూడ్ నియోజకవర్గంనుండి గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి దర్శన్ ధృవనారాయణన్ (28) పిన్న వయస్కుడైన ఎంఎల్‌ఎగా వున్నారు.

మోడీ మళ్లీ గెలిస్తే వినాశనమే : పరకాల ప్రభాకర్

బెంగళూరు : 2024 ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ మళ్లీ గెలిస్తే వినాశనమే అని ప్రముఖ ఆర్థికవేత్త, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భర్త పరకాల ప్రభాకర్ వ్యాఖ్యానించారు. మోడీ పాలన యావత్తు ప్రజల్లో విభజన భావాలను వ్యాప్తి చేయడంపైనే కేంద్రీకరించిందని, ఆర్థిక వ్యవస్థ-ఇతర విషయాల్లో ఘోరంగా విఫలమైందని ప్రభాకర్ విమర్శించారు. డాక్టర్ ప్రభాకర్ రచించిన నూతన పుస్తకం 'ది క్రూకెడ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా: ఎస్సెస్ ఆన్ ఎ రిపబ్లిక్ ఇన్ క్రైసిస్'ను ఈ నెల 14న ఆదివారం బెంగళూరు ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని స్పీకింగ్ టైగర్ ప్రచురించినది. ఈ పుస్తకంలో దేశ ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలు, ఇతర సమస్యలపై మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై వరుస వ్యాసాలు ఉన్నాయి. ఈ పుస్తకం విడుదల సందర్భంగా పరకాల ప్రభాకర్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. 2014 ఎన్నికల్లో అభివృద్ధిపై విజయం సాధించినా, తరువాత నుంచి బిజెపి హిందుత్వవాదాన్ని అనుసరిస్తుందని, లౌకికవాదాన్ని పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. 2024లో మోడీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే..కేవలం దేశ ఆర్థిక వ్యవస్థకే కాకుండా.. యావత్తు దేశానికే విపత్తు అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల మధ్య విభజనతో లాభం పొందాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. తన పోరాటం హిందువులు-ముస్లింల మధ్య కాదని, పేదరికం, నిరుద్యోగానికి వ్యతిరేకంగా హిందువులు, ముస్లింలు కలిసి చేసే పోరాటమని ప్రభాకర్ తెలిపారు. బిజెపి, మోడీలు హిందుత్వం కోసం పాకులాడుతుంటే వారిని ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వాల లక్ష్యం విభజనలను తొలగించడం, సామరస్యాన్ని పెంపొందించడంగా ఉండాలని చెప్పారు. అలాగే మోడీ పాలన దేశ ఆర్థిక వ్యవస్థను తప్పుగా నిర్వహిస్తుందని విమర్శించారు. పెద్ద నోట్ల రద్దు విషయంలో మోడీ ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అర్థిక శాస్త్రంలో ప్రాథమిక శిక్షణ పొందిన ఏ ఆర్థిక వేత్తయినా.. ఇంత పెద్ద స్థాయిలో, ఇంత తక్కువ నోటీసు సమయ వ్యవధిలో పెద్ద నోట్ల రద్దుకు సిఫార్సు చేసి ఉండరని ప్రభాకర్ విమర్శించారు. నోట్ల రద్దు పెద్ద తప్పిదమని, తదనంతరం తీసుకున్న తప్పుడు విధానాలు ఈ తప్పిదాన్ని మరింతగా పెంచి సంక్షోభాన్ని, మరింత తీవ్రతరం చేశాయని ప్రభాకర్ విమర్శించారు. యాపిల్ షోరూమ్‌లు లేదా ఫాక్స్‌కాన్ ఉత్పత్తి చేసే ఫోన్‌లు నిజమైన ఆర్థిక పురోగతికి సూచికలు కావని తెలిపారు. ఈ ఏడాది ప్రారంభంలో విడుదల చేసిన ఆక్స్‌ఫామ్ నివేదికలో భారత్‌లో పెరుగుతున్న అసమానతలు, సంపద కేంద్రీకరణను ఎత్తి చూపిన విషయాన్ని గుర్తు చేశారు. మోడీ పాలనలో ఈ ప్రక్రియ వేగవంతమైందని, అధిక సంఖ్యలో భారతీయులు పేదలుగా మారారని ప్రభాకర్ తెలిపారు.

రుణ చెల్లింపుల సంక్షోభం దిశగా అమెరికా !

వాషింగ్టన్ : అమెరికన్ కాంగ్రెస్ ప్రభుత్వ రుణ పరిమితిని పెంచకపోతే జూన్ 1 వరకే చెల్లింపులు జరపగలుగుతామని అమెరికా ఆర్థిక శాఖ సోమవారం తెలియచేసింది. ఆ పైన ప్రభుత్వ ఖర్చులేవైనా భరించే పరిస్థితి లేదని తెలిపింది. ఈ విషయమై ఆర్థిక మంత్రి జానెట్ యెలెన్ రెండు వారాల్లో కాంగ్రెస్‌కు రెండు లేఖలు రాశారు. దీంతో అమెరికా రుణాల చెల్లింపుల సంక్షోభం మరింతగా ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటీవలి ఫెడరల్ పన్ను చెల్లింపులను సమీక్షించిన తర్వాత తమకున్న అత్యుత్తమ అంచనాల ప్రకారం జూన్ 1వరకు ప్రభుత్వ వ్యయాలను భరించగలుగుతామని ఆమె ఆ లేఖలో తెలిపారు. ఈ ప్రకటనతో కాంగ్రెస్‌లోని రిపబ్లికన్లపై ఒత్తిడి పెరుగుతోంది. రాబోయే రోజుల్లో వైట్‌హౌస్ తప్పనిసరిగా ఒప్పందం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒప్పందం కుదరని పక్షంలో అమెరికా చరిత్రలోనే మొదటిసారిగా చెల్లింపుల సంక్షోభం తలెత్తవచ్చని ఆందోళన చెందుతున్నారు. బుధవారం నుండి అధ్యక్షుడు జో బైడెన్ విదేశీ పర్యటన జరపనున్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ఆర్థిక శాఖ అసాధారణ చర్యలు తీసుకునే వాస్తవ తేదీ ఈ అంచనాల తర్వాత కొన్ని రోజులు లేదా వారాలు వుండవచ్చు. మే 1వ తేదీన యెలెన్ మొదటిసారిగా లేఖ రాశారు.

కృత్రిమ తీపి పదార్థాలతో ప్రమాదం

- హెచ్చరించిన డబ్ల్యుహెచ్‌ఓ

న్యూయార్క్ : అనేక ఆహార ఉత్పత్తుల్లో చక్కెర స్థానంలో వాడుతున్న కృత్రిమ తీపి పదార్థాల వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) హెచ్చరించింది. పైగా ఇవి బరువు తగ్గడానికి ఏ విధంగానూ దోహదపడవని తెలిపింది. ఇందుకు సంబంధించి సోమవారం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. అందుబాటులో వున్న సాక్ష్యాధారాలను సమీక్షించిన మీదట ఈ కృత్రిమ తీపి పదార్థాలు పిల్లల్లో గానీ పెద్దల్లో గానీ బరువును తగ్గించడంలో ఎలాంటి దీర్ఘకాలిక ప్రయోజనాన్ని ఇవ్వబోవని స్పష్టం చేసింది. పైగా వీటిని దీర్ఘకాలికంగా వాడడం వల్ల కార్డియోవాస్కులార్ వ్యాధులు, టైప్ టూ డయాబెటిస్ ముప్పు బాగా పెరుగుతుందని హెచ్చరించింది. పెద్దల్లో మరణానికి కూడా దారి తీస్తుందని పేర్కొంది. డైట్ సోడా, కాఫీ వంటి వాటిల్లో లక్షలాదిమంది వీటిని వాడుతున్నారని, కానీ దీర్ఘకాలంగా వాడడం వల్ల ఆరోగ్యపరంగా ఏ మేరకు మంచిదనేది వివాదాస్పదమైన అంశంగా వుంది. సాధారణ చక్కెర స్థానంలో కృత్రిమ తీపి పదార్థాలను ఉపయోగించడం బరువు తగ్గడానికి ఏ మాత్రమూ ఉపయోగపడదని పోషకాహార, ఆహార భద్రతా విభాగ డైరెక్టర్ ఫ్రాన్సెస్కో స్పష్టం చేశారు.

నీట్‌కు కేంద్రంగా మసీదు

- అభ్యర్థులకు అద్భుత ఆతిథ్యమిచ్చిన నిర్వాహక కమిటీ
- ఇదీ అసలైన కేరళ స్టోరీ అంటూ నెటిజన్ల ప్రశంసలు

మసీదు నిర్వాహక కమిటి సభ్యులను అభినందిస్తున్న స్థానికులు

తిరువనంతపురం : కేరళలోని శ్రీమూలనగరం పంచాయితీలో ఉన్న ఒక మసీదు ఇటీవల జరిగిన నీట్ పరీక్షలకు కేంద్రంగా సేవలందించింది. అన్ని మతాలకు, సామాజిక తరగతులకు చెందిన విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. మసీదు నిర్వాహక కమిటీ అద్భుతరీతిలో ఆతిథ్యమిచ్చి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మన్ననలు పొందింది. పరీక్షకు హాజరైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు చేయడంతో పాటు అందరికీ పండ్లు, త్రాగునీరు, మజ్జిగ వంటి ప్రత్యేక సదుపాయాలు సమకూర్చి సేవలందించారు. మత సామరస్యం పరిఢవిల్లే కేరళ ప్రజల ఐక్యతానుబంధానికి ఇది ప్రతీక అని నెటిజన్లు కొనియాడుతున్నారు. ఇదే విషయాన్ని సిపిఎం కూడా పేర్కొంది. సంఘ్ పరివార్ తెరకెక్కించిన 'ద కేరళ స్టోరీ' చిత్రం తప్పుడు కథనాలతో వండివార్చిన చిత్రమని, అసలైన కేరళ ఇది అని సిపిఎం పేర్కొంది. ఈ మేరకు ఫేస్‌బుక్, ఇతర సమాజిక మాధ్యమాల్లోని అధికారిక పేజీల్లో నీట్ పరీక్షకు కేంద్రంగా సేవలందించిన మసీదు, నిర్వాహక కమిటీ సేవలకు సంబంధించిన వీడియోను కూడా సిపిఎం పోస్టు చేసింది.

హెల్త్ ఎమర్జెన్సీకి దారి తీస్తున్న తుపాకీ హింస

ఫోర్బ్స్ వ్యాఖ్య

న్యూయార్క్ : అమెరికాలో తుపాకీ హింస అనేది ప్రజారోగ్య అత్యయిక పరిస్థితికి దారి తీస్తోందని ఫోర్బ్స్ వ్యాఖ్యానించింది. ఈ తుపాకీ హింసను నియంత్రించే చట్టాలను తెచ్చిన ప్రతిసారి అమెరికన్ కాంగ్రెస్ నుంచి, న్యాయ వ్యవస్థ నుంచి వాటికి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ఫోర్బ్స్ ఆదివారం విడుదల చేసిన ఒపీనియన్ ఆర్టికల్ పేర్కొంది. అమెరికాలో అకాల మరణాలకు తుపాకీ హింస ఒక ప్రధాన కారణమని ఆ వ్యాసం పేర్కొంది. ఈ అకాల మరణాలన్నీ నివారించదగినవేనని స్వతంత్ర ఆరోగ్య సంరక్షణా విశ్లేషకుడు జోషువా కొహెన్ పేర్కొన్నారు. తుపాకీ, పిస్టల్ వంటి ఆయుధాలు అందుబాటులో లేకుండా చూడాలని, అలాగే తుపాకీ హింసకు దోహదపడే, సమాజపరమైన, మానసికంగా అంతర్లీనంగా వుండే కారణాలను పరిష్కరించాలని అన్నారు. సార్వజనీనమైన నేపథ్య తనిఖీలు, వయో పరిమితులు, తుపాకీ లైసెన్సింగ్, దాడి చేసే ఆయుధాలపై లేదా అత్యంత సామర్థ్యం కలిగిన తూటాలపై నిషేధం వంటి నిరపాయకరమైన అంశాలనైనా చట్టంలో పొందుపరచడానికి ఫెడరల్ స్థాయిలో ప్రయత్నించడం ప్రస్తుతమున్న రాజకీయ వాతావరణంలో,దాదాపు అసాధ్యమేనని కొహెన్ పేర్కొన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయము, మచిలీపట్నం.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింద ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకొని తిరిగి చెల్లించమని నోటీసులు పంపిననూ తిరిగి చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం **ది. 24-05-2023, బుధవారం సా॥ 4.00 గంటలకు బ్రాంచి ఆవరణలో బహిరంగవేలం వేయబడును.** వేలం వేసినా బకాయి రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదారు ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరిసారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

వ. సం.	ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు	స్థూల బరువు (గ్రాములలో)
		దోకిపర్రు బ్రాంచి	
1.	059216540000015	సోమగని శివ సత్యనారాయణ, తండ్రి : సుబ్బరాయుడు, డోర్ నెం. 6-139, తురైపాలెం,	39.00
2.	059216540000070		30.00
3.	059216540000293		38.00
		కురుమద్దాలి బ్రాంచి	
1.	778006540001199	మండవ స్వర్ణకుమారి, భర్త : లక్ష్మి నారాయణ, డి.నెం. 2/146, కురుమద్దాలి, పామర్రు మండలం.	101.16
		ఫౌండర్స్ బ్రాంచి	
1.	559106540004974	కొల్లేరు ఉమా మహేశ్వరి, భర్త : కె. మోహనరావు, డి.నెం. 13/116, నిజాంపేట, మచిలీపట్నం.	34.00
		నాగాయలంక బ్రాంచి	
1.	037630100323847	కారంకి శివ పార్వతి, భర్త : నాగమల్లేశ్వరరావు, డోర్ నెం. 5/62, గౌడ దిబ్బ, గణపేశ్వరం, దిండి, నాగాయలంక - 521120	23.00

షరతులు : 1) వేలంలో పాల్గొనువారు **రూ. 5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే)** ధరావత్తు చెల్లించవలెను. **2)** వేలంలో ఆభరణములు పొందినవారు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెను. వేలంలో ఆభరణములు పొందని వారికి ధరావత్తు సొమ్ము వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. **3)** ఏ స్థితిలోనైనా వేలం నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. **4)** వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. **5)** వేలంలో పాల్గొను వారు ఆధార్ మరియు పాన్‌కార్డు కాపీలను సమకూర్చవలెను.

ది. 16-05-2023 సం/- అధీకృత అధికారి

వేసవి విడిది

ఫ్యాషన్

హాయ్ ఫ్రెండ్స్,
నా పేరు పూర్ణ దీపిక. నేను బాగా అల్లరి చేస్తానని అమ్మ నన్ను అల్లరిపిల్ల అంటుంది. కళ్లజోడు పెట్టుకోవడం నాకు భలే ఇష్టం. మా తాత కళ్లజోడు కనిపిస్తే అస్సలు వదలను. కొత్త బట్టలు వేసినప్పుడల్లా అమ్మ ఫొటోలు తీస్తుంటే ఫోజులు బాగా పెడతానని అందరూ అంటారు. ఈ ఫోజులు మీకు కూడా నచ్చాయా..

యు.పూర్ణదీపిక,
ప్రీకేజీ, రంగాపురం,
రెడ్డిగూడెం
మండలం.

నా సెలవులు ఇలా...

హాయ్ నేస్తాలు! నా పేరు కార్తీక. ఈ సంవత్సరం ఎనిమిదో తరగతి పూర్తి చేశాను. చాలా త్వరగా పూర్తి అయ్యింది. అసలు జరిగినట్టే లేదు. 'తొమ్మిదవ తరగతిలోకి అడుగుపెట్టబోతున్నా' అంటేనే చాలా ఆనందంగా ఉంది. మరో పక్క భయంగానూ ఉంది. ముందుగా పాఠాలు చదువుకుందామా అంటే సిలబస్ మొత్తం మారిపోతుందని టీచర్లు చెప్పారు. కొత్త పుస్తకాలు వస్తాయి. అందుకే చదవడం లేదు. కాని లెక్కలు మాత్రం చెప్పించుకుంటున్నా. మా ఇంటి పక్కన సీనియర్స్ ఉన్నారు. వాళ్ల బుక్స్ తెచ్చుకుని చదువుతా. నాకు ఎంతో ఇష్టమైన మా అమ్మమ్మ గారి ఊరు వెళ్తా. కొన్ని రోజులు ఎంజాయ్ చేసి వస్తా. మా నాన్నగారు కంప్యూటర్ క్లాసుకు వెళ్ల అని చెప్పారు. జాయిన్ అవుతా. ఏమి వేసవి సెలవులు ఏమో కానీ పాఠశాల ఉంటే బాగుండూ అనిపిస్తుంది. ఫ్రెండ్స్‌తో కలిసి మాట్లాడుకోవచ్చు, ఆడుకోవచ్చు. కాని స్కూలు ఉన్నప్పుడు..'ఎప్పుడు సెలవులు ఇస్తారా!' అని ఎదురుచూసేదాన్ని. దానికి తోడుగా ఈ ఎండలు మామూలుగా లేవు. బయటకు వెళ్లడానికి లేకుండా కాస్తున్నాయి. మీరు కూడా జాగ్రత్తగా ఉండండి. అవసరానికే బయటకు వెళ్ళండే. మీరు కూడా సెలవుల్లో ఏం చేయబోతున్నారు ఈ పేజీలో అందరితో పంచుకోండి.

- సిహెచ్ కార్తీక,
8వ తరగతి,
అరవింద మోడల్ స్కూలు, మంగళగిరి,
గుంటూరు జిల్లా.

నవ్వుకుందాం

ఎస్ ఐ : సినిమా థియేటర్ దగ్గర బ్లాక్ టికెట్లు అమ్మేవారిని పట్టుకోమన్నానుగా..
కానిస్టేబుల్ : చూశా సార్. అక్కడ టిక్కెట్లన్నీ పసుపు, గులాబీ రంగుల్లోనే ఉన్నాయి.

బొమ్మరిల్లు

- దీక్షిత,
5 వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జగతి,
కవిటి మండలం,
శ్రీకాకుళం జిల్లా.

- రాచకొండ గౌతమి,
శెట్టివారి గూడెం,
చింతలపూడి మండలం,
పశ్చిమ గోదావరి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీ కోసం

కూరగాయలు కట్ చేసేటప్పుడు వేళ్లు తెగకుండా ఉండాలంటే ప్లాస్టిక్ బాటిల్‌ను వేళ్లు మూసివుంచేలా త్రిభుజాకారంలో కత్తిరించుకుని రబ్బరు బ్యాండుతో బిగించుకుని వేళ్లకు తొడుక్కోవాలి.

జీవన సౌరభం

ఒక మనిషికి డబ్బు ఇచ్చే ధైర్యం కంటే మనిషికి మనిషి ఇచ్చే నమ్మకం చాలా గొప్పది.

JEEVANA
జీవన the family

విద్యాలయాల్లో విద్వేషమూకలు..

విజయవాడలో ఓ ప్రభుత్వ పాఠశాల.. ఉదయం 8 : 30 గంటలకు క్లాసుల వారీగా పిల్లలందరూ స్కూలు అసెంబ్లీకి చేరుతున్నారు. స్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పిఇటి మాస్టారు ఆధ్వర్యంలో స్కూలు ప్రథమ పౌరుడిగా ఎన్నుకున్న గౌతమ్ అసెంబ్లీ నిర్వహిస్తున్నాడు. వందేమాతరంతో అసెంబ్లీ ప్రారంభమైంది. ప్రతిజ్ఞ చెప్పారు. దేశభక్తి గీతాలు ఆలపించారు. మధ్యలో 'సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణీ' అంటూ ఓ శ్లోకం పాడించారు. ఇది చాలా సర్వసాధారణంగా జరుగుతున్న ప్రక్రియ. స్కూలు స్థాపించిన దగ్గర నుండి దేశభక్తి గీతాలతో పాటు ఏదేని దేవతా శ్లోకాన్ని అక్కడ ఆలపించడం జరుగుతోంది. అక్కడే కాదు దశాబ్దాలుగా ప్రభుత్వ స్కూళ్లల్లో ఇదే తంతు నడుస్తోంది. ఎవరూ దీనిపై ఎప్పుడూ నోరుమెదపలేదు. ఎక్కడా దీన్ని పెద్ద చర్చనీయాంశ అంశంగానూ పరిగణించ లేదు.. కానీ ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో ఓ ప్రభుత్వ స్కూల్లో నిర్వహించిన అసెంబ్లీలో విద్యార్థులందరూ దేశభక్తి గీతాలతో పాటు ఉర్దూ గీతాన్ని ఆలపించారని ఆరోపిస్తూ.. ఆ స్కూలు ప్రిన్సిపాల్‌ను, మరో ఇద్దరు ఉపాధ్యాయులను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఇది మొదటిసారి కాదు.. తరచూ అక్కడ ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయి.

లౌకికవాద దేశంలో ఒక మతానికి కొమ్ముకాయడం లేక వ్యతిరేకించడం ఎప్పటికీ ఆమోదయోగ్యం కాదు.. మత రహిత రాజ్యం ఏలుబడి గల దేశంలో అనేక మతాల వారు మతపరమైన స్వేచ్ఛతో జీవించగలగడమే లౌకికవాదం.

యుపి స్కూల్లో అసలేం జరిగింది..

గతేడాది డిసెంబరులో ఓ ఉదయం వేళ స్థానిక ప్రభుత్వబడిలో స్కూలు అసెంబ్లీ జరుగుతోంది. అందులో ప్రముఖ ఉర్దూ కవి, 'సారే జహాసే అచ్ఛా' వంటి దేశభక్తి గీతాన్ని రచించిన మహ్మద్ ఇక్బాల్ 20వ శతాబ్దపు ఆరంభంలో రాసిన 'లబే పే ఆతీ హై దువా..' గీతాన్ని విద్యార్థులు ఆలపించారు. కొంతమంది టీచర్లు ఆ సన్నివేశాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అది బాగా వైరల్ అయి హిందూత్వ మూకల కళ్లబడింది. అంతే! ఆ స్కూల్లో విద్యార్థులను బలవంతంగా ఇస్లాంలోకి నెడుతున్నారని, అందుకే మదర్సాలలో పాడే మతతత్వ గీతాన్ని స్కూల్లో ఆలపిస్తున్నారని ఆరోపిస్తూ స్కూలు ఎదుట నిరసనకు దిగారు. ఈ బృందానికి కొంతమంది తల్లిదండ్రులు కూడా జత కలిశారు.

అది బడిపిల్లల గేయం..

'ఇదివరకెప్పుడూ ఇలా జరగలేదు. ఆ గేయం బడిపిల్లల విద్యాబుద్ధులకు సంబంధించింది. చీకటి అనే అజ్ఞానాన్ని పారదోలి వెలుగు అనే చదువును ప్రసాదించమని వేడుకునే గీతమది. కొన్ని దశాబ్దాలుగా యూపీ వ్యాప్తంగా హిందూ, ముస్లిం అన్న తేడా లేకుండా పాఠశాలల్లో దీన్ని ఆలపిస్తున్నారు. కాని ఇప్పుడు వాతావరణం అలా లేదు. మతపరమైన మనోభావాలను దెబ్బతీశారని, అల్లర్లు సృష్టిస్తారని ఆరోపిస్తూ నాపై, మరో ఇద్దరు ఉపాధ్యాయులపై కేసులు పెట్టారు. పదిరోజులు మేం శిక్ష కూడా అనుభవించాం' అంటూ స్కూలు ప్రిన్సిపాల్ వజీరుద్దీన్ వాపోయారు. యుపిలో ఈ తరహా సంఘటన జరగడం ఇది తొలిసారి కాదు. ఈ పాటను పాడుతున్నారని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడం ఇది మూడోసారి. కొన్ని వారాల క్రితమే హత్రాస్‌లో ఒక ప్రైవేటు స్కూలు యాజమాన్యం ముస్లిమేతర విద్యార్థులను నమాజ్ చేయాలని నిర్బంధం పెడుతోందని పాఠశాల ఎదుట హిందూత్వ మూకలు దాడికి తెగబడ్డాయి.కానీ, నమాజు చేయించారనటం వాస్తవం కాదు.

అదొక సాంస్కృతిక కార్యక్రమం..

వాస్తవానికి ఆ స్కూల్లో అటువంటిదేమీ జరగలేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులంతా దేశభక్తి గీతాలు పాడారు. దేశ ప్రముఖుల వేషాలు వేశారు. వారి చరిత్రలు చెప్పారు. అందులో భాగంగానే పిల్లల గేయమైన ఈ పాటను ఆలపించారు. కాని బయట నుండి వచ్చిన ఒత్తిడి మేరకు అది నేరంగా భావించి స్కూలు యాజమాన్యం ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేసింది. 'విచారణలో భాగంగా మేము ఆ వీడియోలను చూశాం. అదొక సాంస్కృతిక కార్యక్రమం. ఆరోపించదగ్గ నేరమేమీ అక్కడ కనిపించలేదు. కానీ ఆ టీచర్లు సస్పెన్షన్‌లోనే ఉన్నారు' అంటున్నారు విచారణ అధికారిగా ఉన్న జిల్లా మెజిస్ట్రేట్ అర్చనా వర్మ.

కూలీ పనికి వెళుతున్నారు..

ఒక వర్గాన్ని, ఒక మతాన్ని భయభ్రాంతులకు గురిచేసే అధికారం ఆ మూకలకు ఎవరిచ్చారు..? పాఠశాలల్లో దేశభక్తి గీతాలు మాత్రమే ఆలపించాలన్న ఆదేశాలను కొందరు ప్రబుద్ధులు ఎప్పుడో తుంగలో తొక్కారు. చూసీచూడనట్లుగా వ్యవహరించే యంత్రాంగం ఇప్పుడు యూపీ స్కూళ్లల్లో జరుగుతున్న వ్యవహారాన్ని ఎందుకు తప్పుపడుతోంది..? దీని పర్యవసానంగా జైలు శిక్ష అనుభవించిన ముప్పై ఏళ్ల అనుభవం ఉన్న వజీరుద్దీన్ మాస్టారు ఉద్యోగం పోయి కుటుంబ పోషణ కోసం వ్యవసాయ కూలీగా మారారు.

పాఠ్యగ్రంథంగా ఆమోదించినా..

ఫరూఖన్ అలీ 2019లో యుపిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహించేవారు. 'ఈ గేయం ఎన్‌సిఇఆర్‌టి ఆమోదించిన ఉర్దూ పాఠ్యపుస్తకాల్లో ప్రారంభగీతంగా ఉంది. అయితే ఇది మదర్సాలలో ఆలపించే గేయమని స్కూల్లో పఠించడం నేరమని నాపై నిందలు వేసి ఉద్యోగం నుండి తొలగించారు. విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో మూడురోజుల్లోనే నన్ను విధులకు తీసుకున్నారు. అయితే ఉద్యోగం ఉన్నా నేను మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. వేరే ఊరికి బదిలీ చేశారు' అని చెబుతున్న అలీ మాస్టారుని ఆ మూకలు నానా కష్టాలు పెట్టాయి. స్కూలు నిధులను దుర్వినియోగం చేశారని ఆయనపై లేనిపోని నిందలు వేసి పరువుతీసే ప్రయత్నాలు చేశాయి. ఆ సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ 'మేము ముస్లిములం. మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేయడమే వారి లక్ష్యం' అంటూ అలీ మాస్టారు చెబుతున్నప్పుడు ఆయన కళ్లు శూన్యంలోకి చూస్తున్నాయి.

మతాన్ని అడ్డు పెట్టుకుని మైనార్టీలను హింసించే ఈ మూకలు నిరంతరం రభస సృష్టించటానికే కాచుక్కూచుంటున్నాయి. కర్నాటకలో హిజాబ్ ఉదంతం చూసైనా వీటి నైజం అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి దుందుడుకు, దుర్బుద్ధి చర్యలు దేశ సమైక్యతకు, సామరస్యానికి ప్రమాదకరం.

జీవితంలో ఎన్నో కష్టాలు..

ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ని క్రియేట్ చేసుకున్న విజయ్ ఆంటోనీ నిజ జీవితంలో, సినిమాలో వచ్చేటన్ని మలుపులు, కష్టాలు ఉన్నాయి. ఎన్నో ఇంటర్వ్యూల్లో ఆయన స్వయంగా ఈ విషయాలు వెల్లడించారు.

'**త**మిళనాడులోని నాగర్‌కోయిల్ మా ఊరు. నాన్న ప్రభుత్వ సంస్థలో ఓ చిన్న క్లర్క్. నాన్న ఉన్నంత వరకు మా జీవితం సాఫీగా సాగింది. నాకు ఏడేళ్లప్పుడు ఆయన చనిపోయారు. ఒక్కసారిగా మా కుటుంబం తలకిందులైంది. బరువు బాధ్యతలన్నీ అమ్మే చూసుకోవాల్సి వచ్చింది. మాకంటూ సొంత ఇల్లు లేదు. ఎక్కడ తలదాచుకోవాలో తెలియదు. దాంతో అమ్మా, నేనూ, చెల్లి బంధువుల ఇళ్లల్లో ఉన్నాం. కొంతకాలానికి నాన్న ఉద్యోగం అమ్మకు ఇచ్చారు. ఉద్యోగ నిమిత్తం అమ్మతో కలిసి తిరునల్వేలికి వెళ్లినప్పుడు.. అక్కడ మాకు ఎవరూ ఇల్లు అద్దెకు ఇవ్వలేదు. ఏం చేయాలో తెలియక అమ్మ ఎంతో బాధపడింది. అదే ప్రాంతంలో ఉన్న హాస్టల్స్‌లో మేము ముగ్గురం చేరాం. ప్రతిరోజూ మా ఇద్దర్నీ కలవడానికి అమ్మ వచ్చేది. అయితే, రోజూ కలవడానికి వస్తే మిగతా పిల్లలు బాధపడతారని చెప్పి అమ్మను హాస్టల్‌కు రావొద్దని చెప్పారు. ఉద్యోగంలో భాగంగా ఓసారి అమ్మ వేరే ఊరు వెళ్లారు. కొన్ని రోజులకే నా హాస్టల్‌కు సెలవులు ఇచ్చారు. అప్పుడు ఎక్కడికి వెళ్లాలో, అమ్మను ఎలా కలవాలో తెలియక, శ్రీలంక శరణార్థ విద్యార్థులతో కలిసి బస చేశాను. చేతిలో రూపాయి లేదు. అరటిపళ్లతో కాలం గడిపా. సినిమా వాళ్లకు కావాల్సినంత డబ్బు, సమాజంలో పేరు ఉంటుందని చిన్నప్పుడే నాకు అర్థమైంది. అందుకే ఇండస్ట్రీలోకి రావాలనుకున్నా. అదే విషయాన్ని అమ్మతో చెబితే మొదట అంగీకరించలేదు. విజువల్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేస్తానని చెప్పి చెన్నైకు వచ్చాను. ఓ వైపు చదువుకుంటూనే సినిమాల్లోకి రావడానికి ప్రయత్నాలు చేశాను. నాకు తెలిసిన ఇద్దరు ఫ్రెండ్స్ వద్ద సౌండ్ ఇంజనీరింగ్‌లో మెళకువలు నేర్చుకున్నా. నేను కట్టిన ట్యూన్స్‌ను సీడీగా చేసి ఓ సంస్థకు పంపించా. వాళ్లే నాకు సీరియల్స్‌లో తొలి అవకాశం ఇచ్చారు. ఆ విధంగా ఎలాంటి శిక్షణ లేకుండానే మ్యూజిక్ డైరెక్టర్‌గా మారాను. 'డిష్యుం' తో మ్యూజిక్ డైరెక్టర్‌గా సక్సెస్ అందుకున్నా. తమిళం, కన్నడంతోపాటు తెలుగులో వచ్చిన 'మహాత్మ', 'దరువు' చిత్రాలకు స్వరాలు అందించాను. అలాగే కొన్ని సినిమాలకు ఎడిటర్‌గానూ వర్క్ చేశా. సంగీత దర్శకుడిగా మంచి స్థాయిలో ఉన్నప్పుడే 'విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్' అనే బ్యానర్ స్థాపించి.. 'నాన్'తో హీరోగా ఎంట్రీ ఇచ్చాను. ఇదే చిత్రాన్ని తెలుగులో 'నకిలీ' పేరుతో విడుదల చేసి సక్సెస్ అయ్యాను. ఆ తర్వాత వచ్చిన 'బిచ్చగాడు'తో తెలుగు రాష్ట్రాల్లో నాకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. అమ్మ అంటే నాకెంతో ఇష్టం. ఆమె కోసం ఏదైనా చేస్తాను. నాన్న చనిపోయాక ఆమె ఎన్నో కష్టాలు పడింది. డబ్బు లేకపోతే ఒక ఒంటరి మహిళను ఈ సమాజం ఎలా చూస్తుందో నాకు చిన్నప్పుడే తెలిసింది. 'డిష్యుం' సక్సెస్ ఆ తర్వాత ఓ రిపోర్టర్ (ఫాతిమా) ఇంటర్వ్యూ కోసం నన్ను కలిసింది. ఆ పరిచయం ప్రేమగా మారి పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాం. 'బిచ్చగాడు' తల్లి సెంటిమెంట్‌పై తెరకెక్కిన సినిమా. ఇప్పుడు వస్తున్న 'బిచ్చగాడు -2' దానికి సీక్వెల్ కాదు. మొదటి దానితో దీనికి ఎలాంటి సంబంధం లేదు. ఇది కొత్త కథ. ఈ కథను నేనే రాశాను. సోదరి సెంటిమెంట్‌తో ఇది రూపుదిద్దుకుంది. ఇది తప్పకుండా విజయం అందుకుంటుందని నమ్ముతున్నా. తెలుగులోనూ ఒక సినిమా చేయాలని ఉంది' అని విజయ్ ఆంటోనీ తన వ్యక్తిగత విషయాలు, సినిమా అంశాలు వివరించారు.

'సిరివెన్నెల'పై రచనలు

సాహిత్య రచయిత 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి చనిపోయి ఏడాది అయిన సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు తానా సంస్థతో కలిసి సిరివెన్నెల సంపూర్ణ సాహిత్యాన్ని వెలువరుస్తున్నారు. అందులో కొన్ని సంపుటాలు ఇప్పటికే వచ్చాయి. మరి కొన్ని రాబోతున్నాయి. ఆయన జయంతి (మే 20) సందర్భంగా రెండు అమూల్యమైన పుస్తకాలు రాబోతున్నాయి. అందులో మొదటిది 'పూర్ణత్వపు పొలిమేరలో'. సీతారామశాస్త్రి వ్యక్తిత్వ విశ్లేషణను తెలియచేసే ఈ పుస్తకాన్ని వారి సోదరుడు శ్రీరామశాస్త్రి రచించి, సంకలనం చేశారు. ఈ నెల 20వ తేదీ హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆవిష్కరించ బోతున్నారు. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా, ప్రముఖ గీత రచయితలు రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్ హాజరుకానున్నారు. మే 19న తేదీ రవీంద్ర భారతి సమావేశ మందిరంలో సీతారామశాస్త్రికి సంబంధించిన 'సిరివెన్నెల రసవాహిని' మరో పుస్తకాన్ని కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంస్థ ఆవిష్కరించబోతోంది. రచయిత డాక్టర్ పైడిపాల ఈ పరిశోధనాత్మక రచన చేశారు.



'ఆదిపురుష్' ఇంకో పోస్టర్

ప్రభాస్ రాముడిగా నటిస్తున్న పౌరాణిక చిత్రం 'ఆదిపురుష్' జూన్ నెల 16వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధంకాబోతోంది. తాజాగా ఈ చిత్రం నుండి ఒక పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేసారు. హనుమపై కూర్చొన్న రాముడు, ఆయన చేతిలో విల్లు ఎక్కుపెట్టిన బాణం ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో కృతి సనన్, సైఫ్ అలీఖాన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఓం రౌత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలవుతోంది.

శివాలెత్తిన స్టొయినిస్

- ముంబయిపై ఆరు పరుగుల తేడాతో లక్నో గెలుపు
- ప్లే-ఆఫ్‌కు ఆశలు సజీవం

లక్నో: ప్లే-ఆఫ్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ సత్తాచాటింది. ముంబయి ఇండియన్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లక్నో జట్టు 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినీస్ విధ్వంస ఇన్నింగ్స్ తోడవ్వడం తో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 177పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో ముంబయి జట్టు 10 ఓవర్లు పూర్తయ్యే సరికి వికెట్ నష్టపోయి 92పరుగులు చేసినా.. ఆ తర్వాత తడబాటుకు గురై నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 5వికెట్లు కోల్పోయి 172పరుగులే చేసి ఓడింది. చివరి 6బంతుల్లో 11పరుగులు చేయాల్సిన ముంబయి జట్టు మొహిసిన్ ఖాన్ వేసిన ఓవర్లో కేవలం 5పరుగులే చేసింది. గ్రీన్ 4బంతులు ఎదుర్కొని 2పరుగులే చేయడం ఓటమికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. టాస్ ఓడిన లక్నోకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్‌గా వచ్చిన దీపక్ హుడా(5) విఫలయ్యాడు. బెహ్రెన్‌డార్ఫ్ ఒకే ఓవర్లో హుడా, ప్రేరక్ మన్కడ్(0)ను ఔట్ చేశాడు. క్వింటన్ డికాక్(16) కూడా తక్కువ పరుగులకే పెవీలియన్‌కు చేరిపోయాడు. దీంతో లక్నో జట్టు 35పరుగులకే టాపార్డర్ వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో స్టొయినీస్ 47బంతుల్లో 4ఫోర్లు, 8సిక్సర్లతో 89పరుగులు, కృనాల్ పాండ్యా(49రిటైర్డ్ హర్ట్) 42బంతుల్లో ఫోర్, సిక్సర్ ఆదుకున్నారు. వీరిద్దరూ కలిసి 4వ వికెట్‌కు 78 పరుగులు జోడించారు. లక్నో జట్టు చివరి 4ఓవర్లలో 68పరుగులు చేసింది. బెహ్రెన్‌డార్ఫ్‌కు రెండు, పియూష్ చావ్లాకు ఒక వికెట్ దక్కాయి. ఛేదనలో ముంబయి జట్టుకు శుభారంభం దక్కింది. ఇషాన్ కిషన్(59), రోహిత్ శర్మ(37) కలిసి తొలి వికెట్‌కు 9.1 ఓవర్లలో 90పరుగులు జతచేసి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత టిమ్ డేవిడ్(32నాటౌట్; 19బంతుల్లో ఫోర్, 3సిక్సర్లు) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించాడు. బిష్ణోయ్, యశ్ ఠాకూర్‌కు రెండేసి, మొహిసిన్ ఖాన్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్టొయినీస్‌కు లభించింది.

ఐపిఎల్‌లో నేడు..
పంజాబ్ × ఢిల్లీ
(వేదిక: ధర్మశాల; రా.7.30గం॥లకు)

ప్రణయ్‌కు 7వ ర్యాంక్

బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్ విడుదల

కౌలాలంపూర్: భారత షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ రాయ్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో నిలిచాడు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య(బిడబ్ల్యుఎఫ్) ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో ప్రణయ్ 7వ స్థానంలో నిలిచాడు. 30ఏళ్ల ప్రణయ్ ఇంతకుముందు 8వ ర్యాంక్‌లో నిలిచి కెరీర్ బెస్ట్ సాధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పురుషుల సింగిల్స్ టాప్-10లో మరెవ్వరూ చోటు దక్కించుకోలేకపోయారు. లక్ష్యసేన్, కిదాంబి శ్రీకాంత్ 22, 23 ర్యాంకుల్లో ఉండగా.. మహిళల సింగిల్స్‌లో పివి సింధు టాప్-10లో చోటు దక్కించుకోలేకపోయింది. తాజా ర్యాంకింగ్స్‌లో సింధు 11వ స్థానంలో నిలిచింది. ఇక మహిళల డబుల్స్‌లో త్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ జోడీ కెరీర్ బెస్ట్ ర్యాంక్ 15కు ఎగబాకారు. అంతకుముందు 17వ ర్యాంక్‌లో ఉన్న వీరు తాజా ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు మెరుగుపరుచుకున్నారు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ 7వ ర్యాంక్‌లో నిలిచింది.

3బెర్త్‌లు.. రేసులో 7జట్లు..

ప్లే-ఆఫ్స్ ఛాన్స్ దక్కేది ఎవరికో..?

ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) లీగ్ పోటీలు చివరిదశకు చేరుకున్నాయి. మార్చి 31న డిఫెండింగ్ ఛాంపియన్ గుజరాత్ జెయింట్స్-చెన్నై సూపర్‌కింగ్స్ జట్ల మధ్య అహ్మదాబాద్‌లో జరిగిన తొలి మ్యాచ్‌తో ప్రారంభమైన సీజన్-16 ఐపిఎల్ పోటీలు మే 21(ఆదివారం) బెంగళూరు-గుజరాత్ జట్ల మధ్య చిదంబరం స్టేడియంలో జరిగే చివరి మ్యాచ్‌తో ముగియనున్నాయి. గుజరాత్ జట్టు మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 18పాయింట్లతో ఇప్పటికే ప్లే-ఆఫ్ బెర్త్‌ను ఖాయం చేరుకోగా.. మిగిలిన మూడు బెర్త్‌ల కోసం 7జట్ల మధ్య పోటీ నెలకొంది. దీంతో ఏ జట్టు ప్లే-ఆఫ్‌కు చేరుతుందా? ఏ జట్టు ఆ రేసునుంచి వైదొలుగుతుందా? అనే ఉత్కంఠ క్రీడాభిమానుల్లో నెలకొంది. మొత్తం 10జట్లు ప్రాతినిధ్యం వహించిన సీజన్-16 ఐపిఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు ప్లే-ఆఫ్ రేసు నుంచి ఇప్పటికే నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

ఇక చెన్నై(15పాయింట్లు), లక్నో (15 పాయింట్లు) ముంబయి (14 పాయింట్లు), జట్లు టాప్-4 ఉండి ప్లే-ఆఫ్ రేసులో మిగిలిన జట్లకంటే ముందుండగా.. బెంగళూరు మినహా.. రాజస్తాన్, కోల్‌కతా, పంజాబ్ జట్లు 13మ్యాచ్‌లు ముగిసిన అనంతరం 12పాయింట్లతో దాదాపు ప్లే-ఆఫ్ రేసునుంచి నిష్క్రమించినట్టే.. అద్భుతం జరిగితే తప్ప ఈ మూడు జట్లు ప్లే-ఆఫ్‌కు చేరడం కష్టమే. ఇక బెంగళూరుకు జట్టు విషయానికొస్తే.. బెంగళూరు జట్టు ఆఖరి రెండు లీగ్ మ్యాచ్‌లను సన్‌రైజర్స్, గుజరాత్‌లతో ఆడాల్సి ఉంది. ఆ రెండు మ్యాచుల్లో గెలిస్తే.. బెంగళూరు ఖాతాలో 16 పాయింట్లు ఉంటాయి. దీంతో ఆ జట్టు ప్లే-ఆఫ్‌కు చేరుకొనే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలో ముంబయి, లక్నో జట్లు తమ తమ చివరి లీగ్ మ్యాచుల్లో ఓడితేనే అది సాధ్యమౌతుంది. మరోవైపు ముంబయి జట్టు 21న సన్‌రైజర్స్‌తో, లక్నో జట్టు 20న కోల్‌తా జట్టుతో ఆఖరి లీగ్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఆ రెండు జట్లు తమ చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిస్తే సమీకరణలు మారే అవకాశముంది. ఒకవేళ బెంగళూరు ఒక మ్యాచ్‌లో ఓడితే పై రెండు జట్లు చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిస్తే ముంబయి, లక్నో ప్లే-ఆఫ్‌కు చేరతాయి. ఇక చెన్నై జట్టు విషయానికొస్తే.. ఆ జట్టు 20న ఢిల్లీతో ఆఖరి లీగ్ మ్యాచ్‌లో గెలిస్తే నేరుగా ప్లే-ఆఫ్‌కు చేరుతుంది. ఆ మ్యాచ్‌లో ఓడితే మాత్రం లీగ్ మ్యాచ్‌లు ముగిసే వరకు వేచిచూడాల్సిన పరిస్థితి.

- ప్రజాశక్తి, స్పోర్ట్స్ కరస్పాండెంట్

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	13	9	4	0	18	+0.83
చెన్నై	13	7	5	1	15	+0.38
లక్నో	13	7	5	1	15	+0.30
ముంబయి	13	7	6	0	14	-0.12
బెంగళూరు	12	6	6	0	12	-0.16
రాజస్తాన్	13	6	7	0	12	+0.14
కోల్‌కతా	13	6	7	0	12	-0.25
పంజాబ్	12	6	6	0	12	-0.26
హైదరాబాద్	12	4	8	0	8	-0.57
ఢిల్లీ	12	4	8	0	8	-0.68

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68